Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 107 పేజీలు (Pages): 8 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)


శుక్రవారం, 31 - 10 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# మొంథా తుఫాన్ – పర్ఫెక్ట్ హ్యాండ్లింగ్

## - తుఫాన్ సహాయక చర్యల్లో ప్రతిబింబించిన సీబీఎన్ మార్క్ - ఆర్టీజీ సెంటర్ నుంచి రియల్ టైమ్‌లో పర్యవేక్షణ, పరిష్కారం - ఫైవ్ పాయింట్ ఫార్ములాతో పని చేసిన టీమ్ ఆంధ్రప్రదేశ్ - మానిటర్, అలెర్ట్, రెస్క్యూ, రిహాబిలిటేషన్, నార్మల్సీ వంటి అంశాలపై ఫోకస్ - రక్షణ - సహాయక చర్యల్లో పూర్తి స్థాయిలో టెక్నాలజీ వినియోగం - ప్రభుత్వ ముందస్తు చర్యలతో తగ్గిన ఆస్తి, ప్రాణ నష్టం - క్షేత్రస్థాయిలో పర్యటించి బాధితుల్ని పరామర్శించిన సీఎం చంద్రబాబు - రాష్ట్ర సచివాలయం నుంచి ఆదేశాలు..గ్రామ స్థాయిలో తక్షణం అమలు - ఐదు రోజుల పాటు రాత్రి పగలు పనిచేసిన అధికార యంత్రాంగం

**అమరావతి, (రాజధాని వార్తలు):** మానిటర్, అలెర్ట్, రెస్క్యూ, రిహాబిలిటేషన్, నార్మల్సీ. మొంథా తుఫాను విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని బృందం అమలు చేసిన పంచసూత్ర ప్రణాళిక ఇదే. తుఫాన్ హెచ్చరికలు వచ్చిన నాటి నుంచి నిరంతరం మానిటర్ చేసుకోవడం...ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగాన్ని.. ప్రజలను అలెర్ట్ చేయడం, నీట మునిగిన ప్రాంతాల్లో ఉన్న వారిని ఆదుకోవడం, వారికి పునరావాసం కల్పించడం.. తుఫాన్ తగ్గాక.. సాధారణ పరిస్థితులు తీసుకురావడం. మొంథా తుఫాన్ సమయంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని బృందం ఈ అంశాలపై పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టింది. దీనికి పూర్తి స్థాయి టెక్నాలజీని జోడించడం, క్షేత్రస్థాయిలో మంత్రులు, అధికారులు, ఉద్యోగులతో కూడిన బృందాలతో సమర్థవంతంగా పని చేయించడంతో మొంథా తుఫాను వల్ల కలిగే నష్టాన్ని చాలా వరకు నివారించగలిగింది. ప్రకృతి విపత్తును నివారించే అవకాశం లేదు కాబట్టి...నష్టాన్ని వీలైనంత వరకు తగ్గించుకోవాలనే లక్ష్యంతో టీం ఆంధ్రప్రదేశ్ పని చేసింది. ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించుకునే దిశగా ఐదు రోజుల పాటు రాత్రి–పగలు తేడా లేకుండా అధికార యంత్రాంగం పనిచేసింది. ఇదే ఇప్పుడు సత్ఫలితాలను ఇచ్చింది. మొంథా తుఫాన్ ప్రభావం రాష్ట్రం మీద ఎక్కువగా ఉంటుందనే వాతావరణ హెచ్చరిక రాగానే సీఎం చంద్రబాబు అలెర్ట్ అయ్యారు. తుఫాన్ కదలికలను నిరంతరం



మానిటర్ చేసుకోవడం... ఏయే ప్రాంతాల్లో ఎక్కువ తుఫాన్ ప్రభావం ఉండొచ్చనే విషయాలపై మానిటరింగ్ చేసుకోవడం... ఆ దిశగా క్షేత్ర స్థాయిలో ఉన్న వారిని అలెర్ట్ చేస్తూ... మొంథా తుఫాన్ తీరాన్ని తాకినా... ప్రజల జీవితాలను తాకకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంది ప్రభుత్వం. కొద్దిపాటి ప్రభావం ఉంటుందనుకున్న ప్రాంతాల్లోని వారిని కూడా పునరావాస శిబిరాలకు తరలించారు. లక్ష మందికి పైగా ప్రజలను పునరావాస శిబిరాలకు తరలించి అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. క్షేత్ర స్థాయి నుంచి రియల్ టైంలో సమాచారాన్ని తీసుకోవడం.. దాన్ని విశ్లేషించడం... వాటిని ఆయా విభాగాల బాధ్యులకు చేరవేసి.. సమస్యను పరిష్కరించేలా చూడడం వంటి ప్రక్రియను సీఎం చంద్రబాబు నేతృత్వంలో బృందం సమర్థవంతంగా అమలు చేసింది. ఇక సీఎం చంద్రబాబు క్షేత్రస్థాయిలో పర్యటించి... బాధితులకు భరోసా ఇచ్చారు.

**అనుభవానికి టెక్నాలజీ తోడు**

ఇక ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించేలా ప్రభుత్వం ఈ విపత్తు కాలంలో పని చేసింది. శిశువుల నుంచి వృద్ధుల వరకు.. అలాగే గర్భిణులను కూడా సంరక్షణ కేంద్రానికి తరలించింది. పశువుల ప్రాణాలను కూడా కాపాడేందుకు యంత్రాంగాన్ని పూర్తి స్థాయిలో సమాయత్తం చేశారు. దీనికి టెక్నాలజీని జోడించారు. దీంట్లో భాగంగా ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు వరుసగా 1.1 కోట్ల సందేశాలు పంపారు. అలాగే సాంకేతికతను జోడించి గ్రామాల్లో మైక్ ద్వారా ఎనౌన్సుమెంట్ చేసే విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఆర్టీజీ సెంటర్ నుంచే సెల్ ఫోన్ ద్వారా ఆ మైక్ ఎనౌన్సుమెంటును ఆపరేట్ విధానాన్ని రూపొందించడమే కాకుండా.. ఒకవేళ సెల్ ఫోన్ సిగ్నల్ లేకపోతే శాటిలైట్ ద్వారా ఆ వ్యవస్థ పని చేసేలా చర్యలు తీసుకున్నారు. ఇలాంటి చర్యల వల్ల గతంతో పోల్చితే ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను పునరావాస శిబిరాలకు తీసుకురావడం సులువైంది. సహజంగా లంక గ్రామాల ప్రజలు తమ ఇళ్లను వదిలి రావడానికి ఇష్టపడరు. తుఫాన్లు వచ్చినా...ఇళ్ల పైకప్పులపైకి ఎక్కుతారు. కానీ ప్రభుత్వం ముందుగానే అలెర్ట్ చేయడంతోపాటు... క్షేత్ర స్థాయి సిబ్బంది కూడా ఇంటింటికీ వెళ్లి వారికి నచ్చచెప్పి తుఫాన్ షెల్టర్లకు తీసుకొచ్చింది. దీంతో ప్రాణ నష్టానికి స్థానం లేకుండా చేయగలిగింది. ఇక టెక్నాలజీ వినియోగం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని మరోసారి రుజువైంది. బాపట్ల జిల్లా పర్చూరు వాగులో కొట్టుకుపోతున్న షేక్ మున్నా అనే వ్యక్తిని డ్రోన్ల ద్వారా గుర్తించి పోలీసులు, అధికారుల బృందం అతణ్ని రక్షించింది. అలాగే ప్రభుత్వం వద్ద ఉన్న అలెర్ట్ మెకానిజం ద్వారా త్వరగా రెస్పాండ్ కావడం వల్లే బాపట్ల జిల్లాలోనే ఓ ప్రార్థనా మందిరానికి వెళ్లి చిక్కుకుపోయిన 15 మందిని రెస్క్యూ ఆపరేషన్ చేసి కాపాడారు. ఈ విషయంలో ఏ మాత్రం అలక్ష్యం వహించినా.. వారి ప్రాణాలు దక్కేవి కాదు. ఇక గర్భిణులు, దివ్యాంగుల సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. టెక్నాలజీతో పాటు...ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు (మిగతా 2వ పేజీలో)

# డైవర్షన్ కోసమే వైసీపీ కుట్ర : ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

**అమరావతి, (రాజధాని వార్తలు):** తనను లక్ష్యంగా చేసుకుని వైసీపీ చేస్తున్న ఆరోపణలను మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు ఎంఎస్ రాజు గురువారం అమరావతిలో ఖండించారు. భగవద్గీతను తాను అవమానపరిచినట్లు వైసీపీ అసత్య ప్రచారం చేస్తుందని మండిపడ్డారు. రాజ్యాంగం వల్ల దళితుల జీవిత ప్రమాణాలు మెరుగుపడ్డాయని తాను వ్యాఖ్యానించానని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. మొంథా తుపాన్ ప్రభావంతో ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్నసేవలను డైవర్ట్ చేసేందుకే వైసీపీ ఈ తరహా కుట్రకు తెర తీసిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను దళిత హిందువునని.. కానీ భూమన కరుణాకర్ రెడ్డిలాగా ఇంట్లో ఒక మతం, బయట పదవుల కోసం మరో మతం ఆచరించే వ్యక్తిని కాదంటూ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు స్పష్టం చేశారు. అయినా తాను చేసిన వ్యాఖ్యలకు హిందువుల మనోభావాలు దెబ్బతిని ఉంటే ఒక హిందూ సోదరుడిగా అందరికీ క్షమాపణలు చెబుతు న్నానని ఆయన ప్రకటించారు. టీడీపీ ఎమ్మెల్యే, టీటీడీ బోర్డ్ సభ్యుడు ఎంఎస్ రాజు తాజాగా అనంతపురంలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భగవద్గీతపై ఆయన వ్యాఖ్యలు చేశారంటూ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ నేపథ్యంలో ఎంఎస్ రాజు బహిరంగ




క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్లు అధికమయ్యాయి. అలాంటి వేళ.. ఎంఎస్ రాజు గురువారం మీడియా ముందుకు వచ్చి మాట్లాడారు. తాను చేసిన వ్యాఖ్యలను వైసీపీ వక్రీకరించిందన్నారు. అంతేకాదు.. తుపాన్ నష్టాన్ని భారీగా తగ్గించడంలో ప్రభుత్వం కృషి చేసిందని.. దీని నుంచి ప్రజలను డైవర్ట్ చేసేందుకే వైసీపీ ఈ కుట్రకు తెర తీసిందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు వివరించారు.

# పీఎం, సీఎం..రెండు పదవులూ ఖాళీ లేవు

## - బిహార్ ఎన్నికల ప్రచార సభల్లో లాలూ, సోనియాపై అమిత్ షా విమర్శ

**పట్నా:** కేంద్ర హెూం మంత్రి అమిత్ షా బిహార్‌లో సుడిగాలి పర్యటన చేశారు. దర్భంగా, సమస్తీపూర్, బెగుసరాయ్ నగరాల్లో ఎన్నికల ప్రచార సభల్లో ప్రసంగిస్తూ ఇండియా కూటమిపై విమర్శలు సంధించారు. 'బిహార్‌లో బీజేపీ ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని మైథిలీ ఠాకూర్ వంటి అనేక మంది యువతకు టికెట్లు ఇచ్చింది. కానీ ఆర్జేడీ, కాంగ్రెస్ పార్టీలు మాత్రం ఇవ్వలేదు. ఎందుకంటే లాలూజీ ఆయన కుమారుడు తేజస్విని ముఖ్యమంత్రిని చేయాలనుకుంటున్నారు. సోనియాజీ ఆమె తనయుడు రాహుల్ ప్రధాని కావాలనుకుంటున్నారు. అయితే ఆ రెండు పదవులూ ఖాళీ లేవని వారు తెలుసుకోవాల'ని అమిత్ షా వ్యాఖ్యానించారు. లాలూ ప్రసాద్ వివిధ కుంభకోణాల కేసుల్లో కూరుకుపోగా, కాంగ్రెస్‌పై రూ.12 లక్షల కోట్ల అవినీతి కేసులు ఉన్నాయని విమర్శించారు. ప్రధాని మోదీ, బిహార్ సీఎం నితీశ్‌పై ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేదన్నారు. చొరబాటుదారుల పేర్లు ఓటర్ల జాబితాలో ఉండాలని రాహుల్ గాంధీ, లాలూ ప్రసాద్‌లు కోరుకుంటుండగా... బిహార్‌లో మళ్లీ ఆటవిక రాజ్యం తేవాలన్నది తేజస్వి, రాహుల్ ఉద్దేశమని విమర్శించారు. కాంగ్రెస్–ఆర్జేడీ అధికారంలోకి వస్తే జైళ్లలో ఉన్న నిషేధిత రాడికల్ సంస్థ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) సభ్యులను వదిలేస్తారని ఆరోపించారు. కాగా, పాట్నా జిల్లాలో ఎన్నికల ప్రచార సభలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ప్రసంగించారు.

పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి (నవంబరు 14) నాడు బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యే విషయాన్ని గుర్తుచేస్తూ.. ఎన్డీయేకు మూడింట రెండొంతుల మెజారిటీ ఇవ్వడం ఆయనకు సరైన నివాళి అని వ్యాఖ్యానించారు. నెహ్రూ తమ పార్టీకి చెందిన నాయకుడు కాకపోయినా దేశ తొలి ప్రధానిగా ఆయనను గౌరవిస్తానన్నారు.



యంఏయుడి ఉద్యోగుల కార్యాలయ 4 భవనాల నిర్మాణం సీడ్ యాక్సిస్ రోడ్ E3-N9 జంక్షన్ ప్రాంతం రాజధాని అమరావతిలో నిర్మాణం జరుగుతోంది.
- ఫోటో సేకరణ - యస్ ఆర్ ఆర్

# రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా హసీమ్ బేగ్ పదవీ బాధ్యతలు స్వీకరణ



**విజయవాడ, (రాజధాని వార్తలు)::** రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా హసీమ్ బేగ్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. గత నెల సెప్టెంబరు 3వ తేదీన ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ విడుదల చేసిన గవర్నమెంట్ జీవోలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ పార్లమెంట్ సభ్యులు ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలసౌరి ఆశీస్సులతో హసీమ్ బేగ్‌ని ఈ పదవి వరించిన విషయం తెల్సిందే. ఆనాడు అట్టహాసముగా రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ హసీమ్ బేగ్‌ని ప్రకటించగా ..ఆ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ సాహెబ్ వీసీ, ఎండీ యాకూబ్ బాషా మరియు డిప్యూటీ సెక్రటరీ ఏపీ సచివాలయం సుధాకర్, స్టేట్ మైనారిటీ అధికారులు, బోర్డు సభ్యులు అప్పుడు పాల్గొన్నారు. నేడు బోర్డు 156వ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో బేగ్ పూర్తిస్థాయిలో తన పదవీ బాధ్యతలు స్వీకరించారు.

# " తుఫాను ప్రభావిత ప్రాంతాలలో కొనసాగిన కాకాణి పర్యటన"







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సర్వేపల్లి నియోజకవర్గం, పొదలకూరు మండలం, మోంథా తుఫాన్ కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తున్న నావూరుపల్లి పెద్దవాగును రైతులు, స్థానిక గ్రామ ప్రజలు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పరిశీలించిన మాజీ మంత్రివర్యులు మరియు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి. నావూరు యస్.టి.కాలనీలో దశాబ్దాలుగా వర్షాలు వస్తే, నీళ్లు నిలబడి నరకప్రాయంగా బ్రతికేవారమని, జగనన్న ప్రభుత్వంలో మీరు మంత్రిగా, బ్రిడ్జిని నిర్మించి, భారీ వర్షాలలో సైతం గిరిజన కాలనీలో చుక్కనీరు నిలవకుండా చర్యలు చేపట్టినందుకు మాజీ మంత్రి కాకాని తమ కాలనీ వద్ద ఆపి మరీ ధన్యవాదాలు తెలియజేసిన నావూరు గిరిజన కాలని మహిళలు. తరతరాలుగా నావూరు పెద్దవాగు బ్రిడ్జి కోసం ఎన్నో వినతులు సమర్పించామని, ఎన్నో పోరాటాలు చేశామని, చివరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో జగనన్న ముఖ్యమంత్రిగా, మీరు మంత్రిగా పెద్దవాగు బ్రిడ్జి నిర్మాణం మంజూరు చేయించి, ప్రారంభించినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసిన నావూరు, చెన్నారెడ్డిపల్లి, నావూరుపల్లి, భోగసముద్రం ప్రజలు. భారీ వర్షాల కారణంగా ప్రజలు ఎక్కడా ఇబ్బంది పడకుండా పర్యవేక్షించేందుకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నాం. వర్షాల వస్తే, నావూరు పెద్దవాగు ప్రవహించడంతో, రాకపోకలు ఆగిపోయి దశాబ్దాలుగా నావూరు ప్రజలు క్షోభ అనుభవించారు. నావూరు పెద్ద వాగు ప్రవహిస్తే రాకపోకలు నిలిచిపోయి, చేజర్ల మండలం చుట్టూ తిరిగి ప్రయాణించే దుస్థితి. వృద్ధులు, వ్యాధిగ్రస్తులు గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలు ఇబ్బందులు పాలయ్యేవారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో నేను మంత్రిగా నావూరు ప్రజల సమస్యను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లాను. నావూరు ప్రజల సమస్యను తీర్చడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన ద్వారా 14 కోట్ల 45 లక్షల రూపాయల నిధులు ప్రతిపాదించి, మంజూరు చేసి, పనులు మొదలు పెట్టడం జరిగింది. శరవేగంగా జరుగుతున్న రోడ్డు, నావూరు బ్రిడ్జి పనులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆగిపోయాయి. అధికారంలోకి వచ్చి ఒకటిన్నర ఏడాది గడుస్తున్నా పట్టించుకోకుండా, తమ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు చేయడం దారుణం. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిధులు మంజూరై, ప్రారంభమైన బ్రిడ్జి నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేసి ఉంటే, నావూరు ప్రజలకు ప్రస్తుతం సమస్య ఉండేది కాదు. ప్రజలకు అవసరమైన పనులు చేస్తే, ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోతాయి. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో మేము చేసిన అభివృద్ధి కార్యక్రమాల వల్ల ప్రయోజనం పొందిన గ్రామాల ప్రజలు ఎదురొచ్చి, మరీ మాకు ధన్యవాదాలు చెబుతుండటం సంతృప్తిని కలిగిస్తుంది. చంద్రబాబుకు పనితనం తక్కువ, చేయని వాటిని తానే చేసినట్లు ప్రచారం చేసుకోవడం ఎక్కువ. జగన్మోహన్ రెడ్డి కి పనితనం ఎక్కువ, చేసిన పనులను ప్రచారం చేసుకోవడం తక్కువ. అవినీతి జరిగిందంటూ కూటమి ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణాన్ని ఆపివేసి, పేద ప్రజలను అధోగతిపాలు చేయడం సరైన పద్ధతి కాదు. కూటమినేతలకు ప్రజా ప్రయోజనాల కంటే స్వార్థ ప్రయోజనాలే ముఖ్యం. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో మొదలైన పనులను పూర్తి చేయాలి. ప్రభుత్వం వర్షాల కారణంగా జీవనోపాధి లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు రేషన్ అందించాలని కోరుతున్నాం. వర్షాల కారణంగా ఇళ్లలో నీళ్లు చేరి, నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం ప్రకటించాలి. గెలిస్తే తప్ప ప్రజల గురించి ఆలోచించని నాయకుల్లా కాకుండా, అన్నివేళలా ప్రజలతో ఉంటూ, ప్రజల కష్టాలలో సహాయం అందిస్తూ ప్రజలతో మమేకమై ఉంటాం. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల సమస్యలతో పాటు, నావూరు గ్రామానికి చెందిన చిన్న వాగు సమస్యను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్తాం. జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సమర్థవంతంగా పనిచేశాయి. అధికార ప్రభుత్వానికి, ప్రత్యామ్నాయ ప్రభుత్వంలా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రజలకు ఎక్కడ ఇబ్బందులు కలగకుండా అన్ని సహాయక చర్యలు చేపట్టారు. జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు తుఫాను నేపథ్యంలో ప్రజలకు అండగా నిలిచిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పేరుపేరున ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.

# మన జాతి వైభవానికి ఆలయాలు మూలాధారాలు

**- సుందరీకరణ పేరుతో ఆలయాల ప్రాచీనత దెబ్బతినకూడదు - పెద్దల వారసత్వ పరంపరను కొనసాగించాలి - పునర్నిర్మాణంతో వేణుగోపాలస్వామి ఆలయ పూర్వవైభవం - శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి అనుగ్రహభాషణం - దేవాదాయశాఖ మంత్రిగా ఆనం సంకల్పం గొప్పదని వ్యాఖ్య - అంగరంగం వైభవంగా వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవం**






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మన జాతి వైభవానికి ఆలయాలు మూలాధారాలు.. పురాతన ఆలయాల ప్రాచీన చరిత్రను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని పరమహంస, పరివ్రాజకాచార్యులు శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి అనుగ్రహభాషణం చేశారు. బుధవారం ఉదయం నెల్లూరు మూలాపేటలోని శ్రీ రుక్మిణి సమేత వేణుగోపాలస్వామి ఆలయ శంకుస్థాపన మహోత్సవం శ్రీ చిన్నజీయరు స్వామి వారి స్వహస్తములతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత హోమశాలలో ప్రత్యేక పూజల అనంతరం వేణుగోపాలస్వామి, ఉప ఆలయాల పునర్నిర్మాణానికి శంకుస్థాపన పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తుల గోవిందనామస్మరణలతో, వేద మంత్రోచ్ఛరణలు, అచెంచలమైన భక్తివిశ్వాసాలతో ఆలయ శంకుస్థాపన మహోత్సవం నేత్రపర్వంగా జరిగింది. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరిజవహర్‌లాల్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, దేవాదాయశాఖ ఉన్నతాధికారులు, ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు, ప్రముఖులు, భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విచ్చేసిన భక్తజనాన్ని ఉద్దేశించి చిన్నజీయరు స్వామి అనుగ్రహభాషణం చేశారు. చిత్తశుద్ధి, మంచి సంకల్పం ఉంటే భగవంతుడు మన వెంట ఉంటాడు అనేందుకు ఈరోజు జరిగిన ఈ గొప్ప కార్యక్రమమే మంచి ఉదాహరణగా చిన్నజీయరు స్వామి ఉదహరించారు. ఒక పక్క భయంకరమైన తుపాను వల్ల ఈ కార్యక్రమంపై అనేక సందేహాలు వచ్చాయని, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సంకల్పం, భగవంతుడి కార్యక్రమం మంచిగా జరగాలనే అందరి తపన, చిత్తశుద్ధితోనే తుపాన్ గండం తొలగి దిగ్విజయంగా కార్యక్రమాన్ని భగవంతుడు చేయించాడని చెప్పారు. చిత్తశుద్ధి, మంచి సంకల్పానికి అంత శక్తి ఉంటుందని భక్తులకు ఉపదేశించారు.

**తెలుగుజాతి చరిత్ర చాలా గొప్పది : చిన్నజీయరు స్వామి**

భారతదేశం మొత్తం మీద తెలుగువారికి ఉన్న చరిత్ర మరెవ్వరికీ లేదని చిన్నజీయరు స్వామి అన్నారు. ఆహారంలోనూ.. విహారంలోనూ.. వ్యవహారంలోనూ తెలుగువాడి చరిత్ర గొప్పదన్నారు. తమిళనాడులోని శ్రీరంగం, మధురై పురాతన ఆలయాల్లో ఇప్పటికీ మన తెలుగులిపి కనిపిస్తుందన్నారు. మన చరిత్రను మనం సంరక్షించుకోవాలన్నారు. తెలుగువారి చరిత్రకు ఆలయాలే మూలాధామన్నారు. ఆలయాల సుందరీకరణ తప్పు కాదని, అయితే ఆలయాల ప్రాచీనత దెబ్బతినకూడదన్నారు. ఆలయాల చరిత్ర కనుమరుగు కాకుండా ఆలయాల పునర్నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. పురాతన శిలాశాసనాలు, శిలాఫలకాలు, వస్తుసామగ్రిని అలాగే ఉంచి మన చరిత్రకు సాక్ష్యాలుగా రేపటి తరాలకు అందించాలన్నారు. పూర్వీకులు మనకు అందించిన వేల సంవత్సరాల చరిత్ర పరంపరను కొనసాగిస్తూ ఆలయాలకు వైభవం తీసుకురావాలని సూచించారు.

**వేణుగోపాలస్వామి ఆలయ పూర్వవైభవంలో అందరూ భాగస్వామ్యులు కావాలి : చిన్నజీయరుస్వామి**

ఎంతో గొప్ప ప్రాశస్త్యం గల శ్రీ వేణుగోపాలస్వామి ఆలయానికి గత పూర్వవైభవం తీసుకొచ్చేందుకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దేవాదాయశాఖ అధికారులు ఎంతో కృషి చేస్తున్నారని, భక్తులు కూడా ఈ మహత్కార్యంలో భాగస్వాములు కావాలని చిన్న జీయర్ స్వామి పిలుపునిచ్చారు. ఐదు కుటుంబాల నుంచి వంశపారంపర్యంగా వస్తున్న ట్రస్టుబోర్డు సభ్యులు ఆలయ పవిత్రతను కాపాడాలనే సంకల్పంతో పెద్దల వారసత్వాన్ని కొనసాగించాలనే ఆలోచన చేయడం సంతోషకరమన్నారు. నెల్లూరు శాసనసభ్యులు దివంగత ఆనం వివేకానందరెడ్డి పెద్ద కుమారుడు ఆనం చెంచు సుబ్బారెడ్డి కూడా ట్రస్టుబోర్డులో సభ్యుడిగా చేరడంతో ట్రస్టుబోర్డుకు పరిపూర్ణత చేకూరిందన్నారు. ట్రస్టుబోర్డు సభ్యులు, అర్చకులు ఆలయ అభివృద్ధిలో కీలక భూమిక పోషించాలన్నారు. 18నెలల్లోనే ఆలయ నిర్మాణం పూర్తి చేసేందుకు కృషి. చిన్నజీయరు స్వామి వారి ఆశీస్సులతో ఆలయ పునర్నిర్మాణం. ఆలయంలోని శిలఫలకాలకు సముచిత గౌరవంతో తిరిగి ఏర్పాటుచేస్తాం. ట్రస్టుబోర్డులోకి ఆనం వివేకానందరెడ్డి పెద్ద కుమారుడు ఆనం చెంచుసుబ్బారెడ్డి. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 27వేల ఆలయాల బాధ్యతను సీఎం చంద్రబాబు నాయుడు తనపై నమ్మకంతో అప్పగించారని, ఆ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ఆలయాల అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు చెప్పారు. ఎంతో చరిత్ర, ప్రాశస్త్యం గల శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో గతంలో వందలాది కల్యాణాలు జరిగేవని, భక్తులతో ఆలయం కళకళలాడేదని మంత్రి గుర్తుచేశారు. అయితే కాలక్రమంగా ఆలయ శక్తి తగ్గడంతో చిన్నజీయరు స్వామి వారి సూచనల మేరకు ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. రాష్ట్రప్రభుత్వం 17 కోట్ల నిధులను మంజూరుచేసినట్లు చెప్పారు. ఆలయ పవిత్రత దెబ్బతినకుండా ఖర్చుకు వెనకాడకుండా ఆలయ గర్భాలయం, అంతరాలయం, రాజగోపురం, అన్వేటి మండపం నిర్మాణాలను రాతి కట్టడాలతోనే నిర్మిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా కూడా ఆలయాల పునర్నిర్మాణాలను రాతికట్టడాలతోనే నిర్మిస్తామని, ఇందుకు వేణుగోపాలస్వామి ఆలయం నుంచే శ్రీకారం చుడుతున్నట్లు మంత్రి చెప్పారు. వేణుగోపాలస్వామి ఆలయం నుంచే దళితుల ప్రవేశం జరిగిందన్న మంత్రి, ఆనాటి జ్ఞాపకాలను, ఆలయంలో ఉన్న పురాతన శిలాఫలకాలను సముచిత గౌరవంతో తిరిగి ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఐదుగురు సభ్యులతో ట్రస్టుబోర్డు ఉండాల్సి ఉండగా, ఒక స్థానంగా ఖాళీగా ఉండడంతో ఆనం వివేకానందరెడ్డి గారి పెద్దకుమారుడు ఆనం చెంచుసుబ్బారెడ్డి ట్రస్ట్ సభ్యుడుగా నేడు ప్రమాణం చేసి బాధ్యతలు స్వీకరించినట్లు మంత్రి చెప్పారు. ఆలయ నిర్మాణానికి రెండేళ్లు కాలం ఉన్నప్పటికీ 18నెలల్లోనే అద్భుతంగా నిర్మాణాలను పూర్తి చేసి ఇవ్వాలని కాంట్రాక్టర్‌ను కోరినట్లు చెప్పారు. ఆలయ నిర్మాణం పూర్తయిన వెంటనే మహాకుంభాభిషేకం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను కూడా చిన్నజీయరు స్వామి వారి స్వహస్తములతో నిర్వహిస్తామని ఈ సందర్భంగా ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. సర్వాంగ సుందరంగా ప్రాచీన వైభవానికి తగినట్లుగా శ్రీ వేణుగోపాల స్వామి ఆలయాన్ని పునర్నిర్మించేందుకు దేవాదాయ శాఖ కృషి చేస్తుందని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. తొలుత వేణుగోపాలస్వామి ఆలయ విశిష్టతపై రూపొందించిన పుస్తకాన్ని చిన్న జీయర్ స్వామి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఉన్నతాధికారులు, ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# మోంథా తుఫాన్ – పర్ఫెక్ట్ హ్యాండ్లింగ్

(మొదటి పేజీ తరువాయి)

ఎలా హ్యాండిల్ చేయాలనే అంశంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకున్న అనుభవం బాగా కలిసి వచ్చింది.


**లైవ్ ట్రాకింగ్, రియల్ టైం సొల్యూషన్స్**

ఇక పంటలకు నష్టం వాటిల్లకుండా కూడా ప్రభుత్వం వీలైనంత మేరకు జాగ్రత్తలు తీసుకుంది. తుఫాను హెచ్చరికలు వచ్చినప్పటి నుంచి కాల్వల్లో గుర్రపు డెక్క తొలగించే అంశాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టేలా సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఈ విధంగా చేయడం ద్వారా వీలైనంత మేర పంట నష్టం తగ్గించే ప్రయత్నం చేసింది ప్రభుత్వం. ఇక డ్రైన్లు కూడా క్లీనప్ చేయడంతో... నగరాల్లో కూడా నీటినిల్వ లేకుండా చూడడంలో అధికార యంత్రాంగం సక్సెస్ అయింది. ఇక తుఫాన్ గాలులకు చెట్లు పడిపోయినా.. విద్యుత్ స్థంభాలు పడిపోయినా, వైర్లు తెగి పడినా వాటి కారణంగా ట్రాఫిక్ జాం కాకుండా, ప్రమాదాలు జరగకుండా.. వెంటనే వాటిని తొలగించడంతోపాటు.. విద్యుత్ వ్యవస్థను అతి తక్కువ సమయంలోనే పునరుద్ధరించారు. దీనికోసం అవసరమైన సామాగ్రి, వాహనాలను ముందుగానే సిద్ధం చేసుకున్నారు. వేలకొద్ది యంత్రాలను.. వాహనాలను ప్రణాళికాబద్ధంగా వినియోగించుకున్నారు. ఇక సహాయక చర్యల నిమిత్తం జేసీబీలను కూడా భారీ ఎత్తున సిద్ధం చేసుకుంది. వాటికి లైవ్ ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా అవసరమైన మేరకు వాటిని వినియోగించుకునే వెసులుబాటు కలిగింది. గతంలో వర్షాలు వచ్చినా.. వరదలు వచ్చినా.. బోట్లు కొట్టుకు రావడం.. బ్యారేజీల గేట్లకు బలంగా తాకడం వంటివి జరిగేవి. కానీ ఈసారి అలాంటి తప్పిదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. దీంట్లో భాగంగానే... నెల్లూరు జిల్లా కలెక్టర్ తనకు అందిన సమాచారంతో అలెర్ట్ కావడంతో భారీ బోటును చాకచక్యంగా ఒడ్డుకు చేర్చారు. లేకుంటే సంగం బ్యారేజీకి ఆ బోట్లు ఢీ కొట్టి..ప్రమాదం ఏర్పడేది. ఇవన్నీ ముందు జాగ్రత్తలు తీసుకోవడం, అలెర్ట్ మెకానిజం ఉండడం వల్ల తప్పిన ప్రమాదాలే. ఇక కాల్వలు, చెరువులకు గండ్లు పడకుండా నిరంతరం పర్యవేక్షించడంతోపాటు... గండ్లు పడితే వాటిని యుద్ధ ప్రాతిపదికన పూడ్చేందుకు అవసరమైన ఇసుక బస్తాలను సిద్ధం చేశారు. అలాగే రాష్ట్ర సచివాలయంలో ఆర్టీజీ సెంటర్ ద్వారా వచ్చిన ఆదేశాలు గ్రామ సచివాలయ స్థాయిలో వెంటనే అమలు చేయగలిగేలా విజయవంతంగా ప్రభుత్వం పని చేసింది.

**త్వరితగతిన నష్టపరిహారం అందచేయడం... నష్టం అంచనాల రూపొందించడం**

ఇక పునరావాస శిబిరాలను ముందుగానే సిద్ధం చేశారు. ఎప్పుడు అవసరమైతే.. అప్పుడు సహాయ శిబిరాలను హడావుడిగా ఏర్పాటు చేసుకునే పరిస్థితికి స్వస్తి చెప్పాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. వాతావరణ హెచ్చరికలు వచ్చినప్పట్నుంచి పునరావాస శిబిరాలను సిద్ధం చేసుకోవాలని చెప్పడమే కాకుండా.. వాటిని అమల్లో పెట్టేలా చేశారు సీఎం. బాధితులకు ఆహారం, వసతి కల్పించడంతోపాటు.. కావాల్సిన మందులను కూడా పునరావాసంలో అందుబాటులో ఉంచారు. ఇలాంటి ఏర్పాట్లను సిద్ధం చేయడంతోపాటు.. పునరావాస కేంద్రాల్లోని పరిస్థితులను కూడా ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అలాగే వైద్య బృందాలను సిద్ధం చేశారు. బాధితులకు అందించే నిత్యావసర వస్తువులను.. ఆర్థిక సాయాన్ని కూడా ముందుగానే ప్రభుత్వం సిద్ధం చేసుకుంది. ఇక పునరావాస శిబిరాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు... తుఫాన్ వెలిశాక.. ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు తీసుకు రావడానికి కూడా ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. ఇక పంటనష్టం అంచనాలను కూడా త్వరితగతిన వేసి..కేంద్రానికి వీలైనంత త్వరగా నివేదికలు సమర్పించే వరకు పూర్తి స్థాయిలో ముందస్తు ప్రణాళికలతో ప్రభుత్వం వ్యవహరించింది.

# తుఫాన్ ప్రభావం, టెక్నాలజీ సాయంతో నష్ట నివారణ : సీఎం చంద్రబాబు



**అమరావతి, (రాజధాని వార్తలు):** టెక్నాలజీ సాయంతో తుఫాన్ ప్రభావంతో కలిగే నష్టాన్ని తగ్గించగలిగాం. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేశాయి. మొదటి రోజునే పరిస్థితులను చాలా వరకూ చక్కదిద్దాం. ఎప్పటికప్పుడు తుఫాన్‌పై సమీక్షలు నిర్వహించాం. అంతర్వేది దగ్గర తీరం దాటి రాష్ట్రంలో భారీ వర్షాలు కురిశాయి. శాటిలైట్ ఇమేజ్‌ల ఆధారంగా తుఫాన్ పరిస్థితిని అంచనా వేశాం. ప్రిపరేషన్, ముందస్తు ప్రణాళికల వల్ల ప్రకృతి వైపరీత్య నష్టాన్ని బాగా తగ్గించాం. వర్షాలు, గాలుల తీవ్రతను అంచనా వేస్తూ ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేసి చర్యలు తీసుకున్నాం. గతంలో తుఫాన్ ప్రభావం తగ్గిన వారం రోజుల వరకూ కోలుకునే పరిస్థితి ఉండేది కాదు. తుఫాన్లు, వర్షాలను ఆపలేం కానీ అప్రమత్తత, ముందస్తు చర్యలతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించే అవకాశం ఉంది. తుఫాను ప్రభావం ఉన్న అన్ని ప్రాంతాల్లో టెక్నాలజీ వినియోగించి నష్టాలను తగ్గించగలిగాం. భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో ఎక్కడెక్కడ ప్రవాహాలు పెద్ద ఎత్తున వస్తాయి అనేది అంచనా వేసి ముందస్తుగా హెచ్చరికలు ఇచ్చాం. తుఫాన్ కారణంగా దాదాపు రూ.5,265 కోట్ల మేర నష్టం జరిగి ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశాం. వ్యవసాయం, ఉద్యాన, ఆక్వా, రహదారులు రూ.2079 కోట్లు, విద్యుత్, జలవనరుల విభాగంలో రూ.207 కోట్లు నష్టం జరిగింది. గతంలో గుండ్లకమ్మ, పులిచింతల గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదు. తుఫాన్ నష్టాలను పూర్తి స్థాయిలో అంచనా వేసి కేంద్రానికి పంపిస్తాం. రియల్ టైమ్‌లోనే డేటా లేక్ ద్వారా సమాచారం విశ్లేషించి త్వరగా నిర్ణయాలు తీసుకోగలిగాం. తుపాను నష్ట తీవ్రత తగ్గించే అంశంపై మంత్రులు క్షేత్ర స్థాయిలో, ఆర్టీజీఎస్ నుంచి మంత్రి లోకేష్, అనిత ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. కూటమి ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు కూడా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు భరోసా ఇచ్చారు. వారందరికీ అభినందనలు తెలియచేస్తున్నాను. టెక్నాలజీ వినియోగించి పంట నష్టాలు, ముంపు ప్రాంతాలు తదితర అంశాలను కూడా గుర్తిస్తాం. ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రజలకు నష్టం వాటిల్లకుండా చూస్తుంటే కొందరు ఫేక్ పోస్టులు పెడుతున్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయడం కూడా వారికి ఇష్టం లేనట్టు ఉంది.



**నెల్లూరు జిల్లా ఖజానా కార్యాలయంలో నూతనంగా డిటి & ఏఓ బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులుకి ఖజానా సిబ్బంది తరపున హృదయపూర్వక పలువురు శుభాకాంక్షలు తెలియజేసారు.**


# తెలుగు వారికి తీవ్ర గాయాలు.. స్పందించిన కేంద్ర మంత్రి




**లక్నో :** ఉత్తరప్రదేశ్‌లోని జాన్పూర్ సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురుగా వస్తున్న వాహనాన్ని కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో 16 మందికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించిన పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని.. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరించారు. బాధితుల్లో ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి, బ్రాహ్మణతర్ల, పలాస ప్రాంతాలకు చెందిన వారు ఉన్నారు. ఈ ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు వెంటనే క్షతగాత్రులను పరామర్శించారు. అనంతరం జాన్పూర్ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు. బాధితులకు సత్వరమే మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఆదేశించారు. ఇక ఈ ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# "సర్వేపల్లిలో విస్తృతంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సేవలు"




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సర్వేపల్లి నియోజకవర్గం, తోటపల్లి గూడూరు మండలం, పేడూరు గ్రామంలోని కొల్లిదిబ్బ గిరిజన కాలనీవాసులకు భోజనం, తదితర ఏర్పాట్లు చేసిన స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తిక్కవరపు సనత్ కుమార్ రెడ్డి మోంథా తుఫాను కారణంగా పనులు లేక పస్తులతో గడుపుతున్న గిరిజనులకు భోజన సదుపాయం కల్పించిన సనత్ కుమార్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి సర్వేపల్లి నియోజకవర్గంతో పాటు, నెల్లూరు జిల్లా వ్యాప్తిగా అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొని, విపత్తు సమయంలో ప్రజలకు సహాయ సహకా




రాలు అందించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు తెలియజేసిన కాకాణి.

# వరద ప్రభావిత గ్రామాలు పర్యటించిన ఎమ్మెల్యే ప్రశాంతమ్మ

**- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తూ అటు అధికార యంత్రాంగాన్ని ఇటు పార్టీ క్యాడర్ ను సమయాత్తం చేయడం వల్లే తుఫాను నష్టాన్ని తగ్గించగలిగాం - బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది**

**- లోతట్టు గ్రామాలలో మెరుగైన డ్రైనేజ్ సదుపాయాలు కల్పిస్తాం : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**











**నెల్లూరు, (రాజధాని వార్తలు):** కష్టకాలంలో ప్రజలకు అండగా వుండాలన్న లక్ష్యంతో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారు నియోజకవర్గ పరిధిలోని వరద ప్రభావిత గ్రామాలను సందర్శించి బాధితులను పరామర్శించారు. విడవలూరు మండలం గాదెల దిన్న గ్రామానికి వెళ్లిన ఆమె గ్రామస్థుల యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాలలో మెరుగైన డ్రైనేజ్ వసతులు ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి హామీ యిచ్చారు. మొంథా తుఫాను సందర్భంగా భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా అధికారులతో కలిసి గ్రామాలలో సహాయక చర్యలు పర్వేక్షించిన నాయకులను ఆమె ప్రశంసించారు. ఇదే స్పూర్తితో ప్రజలతో మమేకం అయి పని చేయాలని ఆమె నాయకులకు మరియు కార్యకర్తలకు సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తూ అటు అధికార యంత్రాంగాన్ని ఇటు పార్టీ క్యాడర్‌ను సమయాత్తం చేయడం వల్లే మొంథా తుఫాను భీభత్సాన్ని నివారించగలిగామన్నారు. వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గ్రామస్థులకు హామీ యిచ్చారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ వెంకటేశ్వర్లు రెడ్డి, తహసీల్దారు చంద్రశేఖర్, ఎంపీడీఓ నగేష్ కుమారి, జెడ్పిటిసి లక్ష్మయ్య, సర్పంచ్ శేషయ్య, విడవలూరు టిడిపి మండల అధ్యక్షులు ఏటూరు శ్రీహరి రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, స్థానిక నాయకులు దిలీప్, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

# తుఫాను వేళ వెల్లివిరిసిన మానవత్వం - నిరాశ్రయులకు అండగా వీఎస్‌యూ వీసీ





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** తుఫాను కారణంగా తీవ్రమైన గాలులు, కుండపోత వర్షం కురుస్తున్న క్షణాల్లోనూ మానవత విలువలను ముందుంచుతూ, విశ్వవిద్యాలయ వైస్-ఛాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు మంగళవారం అర్ధరాత్రి బయటకు వచ్చి నగర వీధుల్లో వణుకుతున్న నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేశారు. చలికి కొట్టుమిట్టాడుతున్న వారికి ఆప్యాయంగా ధైర్యం చెప్పి, స్వయంగా దుప్పట్లు అందజేయడం విశేషం. ఈ సేవా కార్యక్రమాన్ని వీఎస్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ సెల్ మరియు 'హెల్ప్ ది నీడీ' బృందం సంయుక్తంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి శ్రీ చుక్కల పార్థసారధి (ఎన్‌ఎస్‌ఎస్ జాతీయ అవార్డు గ్రహీత, నెల్లూరు) మరియు శ్రీ సంకూరి ప్రవీణ్ రామ్ (టెక్సాస్, యూఎస్‌ఏ) ఉదారంగా అందించిన ఆర్థిక సహకారంతో మొత్తం 100 దుప్పట్లు సేకరించి అవసరమున్న వారికి పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని డాక్టర్ ఉదయ్ శంకర్ అల్లం (ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్) మరియు డాక్టర్ బి.వి. సుబ్బారెడ్డి (ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్) సమన్వయం చేశారు. తుఫాన్ నడుమ కూడ వీఎస్‌యూ సమాజం పట్ల తన బాధ్యతను



నిలబెట్టుకున్న ఈ చర్య, "విద్యతో పాటు సేవా స్పూర్తి - ఇదే వీఎస్‌యూ వైఖరి" అని మరోసారి చాటిచెప్పింది.

# నేత్రపర్వంగా మూలాపేట శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన మహోత్సవం





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** పరమహంస పరివ్రాజకాచార్యులు శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారి స్వహస్తములతో భూమిపూజ కార్యక్రమాలు శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారికి అపూర్వ స్వాగతం పలికిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి భక్తుల గోవింద నామస్మరణలు.... వేదమంత్రోచ్చరణలతో.. అచంచలమైన భక్తివిశ్వాసములతో అంగరంగ వైభవంగా శంకుస్థాపన మహోత్సవం....శిలాఫలకాన్ని ఆవిష్కరించిన శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి కార్యక్రమంలో పాల్గొన్న దేవాదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ హరి జవహర్ లాల్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, పలువురు ప్రముఖులు.

# సంపాదకీయం

## గూగుల్ డేటా సెంటర్ అపోహలు వాస్తవాలు

విశాఖపట్నంలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో డేటా సెంటర్‌ను నిర్మించబోతోందనే వార్తలు వెలువడగానే అనేక ఇతర రాష్ట్రాలతో పాటు రాష్ట్రంలోని ప్రతిపక్షం కూడా ప్రభుత్వంపైన ప్రతికూలంగా స్పందించింది. తద్వారా అసలు 'డేటా సెంటర్' అంటే ఏమిటి? దీని ప్రాధాన్యం ఏమిటి? సమాజానికి దీని అవసరం ఉందా? అనే ప్రశ్నలు సహజంగానే తలెత్తుతాయి. మనం యూట్యూబ్‌లో సినిమానో, ఫేస్‌బుక్‌లో రీల్‌నో స్ట్రీమ్ చేసినప్పుడూబీ గూగుల్ పేనో ఫోన్ పేనో చెల్లింపుల కోసం వాడినప్పుడూ, గూగుల్‌నో, చాట్ జీపీటీనో ప్రశ్న అడిగినప్పుడూ, వాట్సాప్‌లో మెసేజ్‌లు పంపినప్పుడూ... ఈ డేటా అంతా ఎక్కడో ఒకచోట ఉండాలి. ఇది కేవలం 'క్లౌడ్'లో తేలుతూ ఉండదు. ఇది ప్రత్యేకమైన, అత్యంత సురక్షితమైన భవనంలో నెలకొల్పబడిన డేటా సెంటర్‌లో ఉంటుంది. డేటా సెంటర్‌లు కేవలం నిల్వ సౌకర్యాలు మాత్రమే కాదు, అవి మొత్తం డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు పునాదిగా ఉంటాయి. నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత దేశం ఇంతటి ప్రాధాన్యం గల డేటా సెంటర్ల వ్యవస్థాపనలో టాప్ 10 దేశాల్లో కూడా లేదు. ప్రపంచవ్యాప్తంగా డేటా సెంటర్ పోటీలో ఇతర దేశాలకు అందనంత ఎత్తులో అమెరికా ఉన్నది. అక్కడ మార్చి 2025 నాటికి 5,426 డేటా సెంటర్లు ఉన్నాయి. అమెరికా తరువాత చైనాలో వేలాది డేటా సెంటర్లు ఉన్నాయి. వాటిలో హైపర్ స్కేల్ డేటా సెంటర్లు 100కు పైగా ఉన్నాయి. అలాగే జర్మనీలో 529, బ్రిటన్‌లో 523, ఫ్రాన్స్‌లో 322, ఆస్ట్రేలియాలో 314, నెదర్లాండ్స్‌లో 298, రష్యాలో 251, ఇటలీలో 173, మెక్సికోలో 168 డేటా సెంటర్లు ఉన్నాయి. డేటా సెంటర్ల నిర్వహణలో విద్యుత్ వినియోగం కీలకం కాబట్టి, వాటిని అవి వినియోగించే విద్యుత్ పరిమాణంతో కొలుస్తారు. 2023లో అమెరికాలోని డేటా సెంటర్‌లు 176 టెరావాట్ గంటల విద్యుత్‌ను ఉపయోగించాయి (1 టెరావాట్ గంటలు అంటే 10 లక్షల మెగావాట్ గంటలకు సమానం). ఇది అమెరికా మొత్తం విద్యుత్ వినియోగంలో దాదాపు 4.4శాతం. ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ పెరుగుదలతో డేటా సెంటర్ల విద్యుత్ వినియోగం 2030 నాటికి 12 శాతానికి పెరగవచ్చు. నీటి వినియోగం కూడా ఎక్కువే. అయితే లిక్విడ్ కూలెంట్ సాంకేతికతతో అది నిర్వహించగలిగే స్థాయిలోనే ఉంటుంది. ఈ లెక్కలను చూసినప్పుడు డేటా సెంటర్ల నిర్మాణంలో అమెరికాకు చేరువగా ఇప్పట్లో ఏ దేశమూ చేరుకోలేదని అర్థమవుతుంది. ఈ డేటా సెంటర్ల వ్యవస్థాపనలో భారతదేశం ఎక్కడుంది? భారతదేశం 138 డేటా సెంటర్లతో ప్రపంచంలో 13వ స్థానంలో ఉంది! అదనంగా, 2025 చివరికల్లా 1015 మెగావాట్ల సామర్థ్యంతో 45 కొత్త డేటా సెంటర్‌ల నిర్మాణం జరుగుతోంది. భారతదేశంలో డేటా వినియోగం వేగంగా పెరుగుతున్నది. ప్రపంచ డేటాలో 20శాతం భారతదేశం నుంచే వస్తోంది. జూన్ 2023లో ప్రచురితమైన ఎరిక్సన్ మొబిలిటీ నివేదిక ప్రకారం... 2028 నాటికి భారతదేశంలో ప్రతి వినియోగదారుడు నెలకు 62 జీబీ డేటాను వాడతాడని అంచనా. ఇది అమెరికా, పశ్చిమ యూరప్, దక్షిణ కొరియా, చైనా వంటి అభివృద్ధి చెందిన మార్కెట్‌లను కూడా అధిగమిస్తుంది. అయినప్పటికీ దేశం ఇప్పటికీ ప్రపంచంలో కేవలం 3 శాతంతో అతితక్కువ డేటా సెంటర్ సాంద్రత గల దేశాల్లో ఒకటిగా ఉంది. భారతదేశంలో క్రియాశీల ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య 2025 ముగిసేనాటికి 90కోట్లకు చేరుకుంటుంది. దీనితో పోల్చినప్పుడు 2022లో అమెరికాలో రూ. 30కోట్ల ఇంటర్నెట్ వినియోగదారులు మాత్రమే ఉన్నారు. భారతదేశంలోని డేటా సెంటర్లలో ఎక్కువ శాతం ముంబైలో ఉన్నాయి. చెన్నై రెండవ స్థానంలో ఉంది. దేశంలోని ఇతర డేటా సెంటర్ హబ్‌లు బెంగళూరు, హైదరాబాద్, నోయిడా (ఢిల్లీ-ఎన్‌సిఆర్), పూణే, కోల్‌కతా వంటి నగరాలలో ఉన్నాయి. అక్టోబర్ 14న విశాఖపట్నంలో ఒక భారీ హైపర్ డేటా సెంటర్‌ను నెలకొల్పనున్నామని గూగుల్ ప్రకటించింది. ఈ డేటా సెంటర్ 1-గిగావాట్ (1000 మెగావాట్లకు సమానమైన) సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. అంటే ఇది యావత్ ప్రపంచంలోనే అత్యంత సామర్థ్యం గల డేటాసెంటర్ అవుతుంది. ఇప్పటివరకు అమెరికాలోని నెవేడాలో 660 మెగావాట్ల సామర్థ్యంతో ఒక డేటా సెంటర్ అత్యంత సామర్థ్యం గలదిగా ఉండేది. విశాఖపట్నం డేటా సెంటర్ 12 దేశాలలో విస్తరించి ఉన్న 'గూగుల్ గ్లోబల్ నెట్‌వర్క్ ఆఫ్ ఏఐ' సెంటర్లలో భాగం అవుతుంది. రాబోయే అయిదేళ్లలో (2026-2030) సుమారు రూ. లక్షా 30వేల కోట్లతో దేశంలో మొట్టమొదటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్‌ను విశాఖపట్నంలో గూగుల్ ఏర్పాటు చేస్తుంది. ఏఐ అభివృద్ధికి కేంద్రంగా పనిచేయడంతో పాటు, విశాఖపట్నం ఒక ప్రధాన కనెక్టివిటీ హబ్‌గా మారనుంది. ఎందుకంటే గూగుల్ దాని సబ్ సీ (సముద్రం అడుగున) కేబుల్ మౌలిక సదుపాయాలను అక్కడకు తీసుకువచ్చి, వాటిని దాని ప్రపంచవ్యాప్త నెట్‌వర్క్‌తో అనుసంధానించనుంది. అంటే గూగుల్ ఏఐ టెక్నాలజీని తీసుకురావడమే కాకుండా, దాని సబ్ సీ కేబుల్, నెట్‌వర్క్ కనెక్టివిటీ హబ్ ద్వారా డిజిటల్ మౌలిక సదుపాయాలను కూడా నిర్మిస్తుంది. దీనితో ఆసియా-పసిఫిక్ ప్రాంతాలకు ప్రత్యక్ష సంబంధం ఏర్పడటమే కాకుండా, దానితో వచ్చే హై స్పీడ్ ఇంటర్‌నెట్ ఇతర కంపెనీల డేటా సెంటర్లు విశాఖపట్నానికి రావటానికి అవకాశం ఏర్పడుతుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గూగుల్‌తో మాత్రమే ఒప్పందం చేసుకున్నప్పటికీ గూగుల్ అదానీ ఎంటర్‌ప్రైజెస్ డేటా సెంటర్ జాయింట్ వెంచర్ సంస్థ అదానీ కోనెక్స్, భారతీ ఎయిర్‌టెల్‌లను వ్యూహాత్మక భాగస్వాములుగా చేసుకుంది. దానితో రూ. 85,000 కోట్ల ప్రాజెక్టుల అంచనా రూ. లక్షా 25వేల కోట్లకు పెరిగింది.

# సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని ఘనంగా జరుపుకోవాలని పిలుపు

**- అందరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి : వి.ఎస్.యు. వైస్ చాన్సలర్ అల్లం శ్రీనివాసులు**






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలంటూ వి.ఎస్.యూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఈ నెల 31వ తేదీ నెల్లూరు నగరంలో, అలాగే నవంబర్ 7వ తేదీ కావలిలో పాదయాత్రలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నెల్లూరు నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో బుధవారం నాడు మేర యువ భారత్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వి.ఎస్.యూ వైస్ చాన్సలర్ అల్లం శ్రీనివాసులు, రిజిస్ట్రార్ సునీత, జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్ర రెడ్డి, జాతీయ సేవా పథకం కో ఆర్డినేటర్ డా.అల్లం ఉదయ్ శంకర్, యూనివర్సిటీ ప్రొఫెసర్ డా వెంకట సుబ్బారెడ్డి, కమ్యూనికేషన్ అధికారి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్ర రెడ్డి మాట్లాడుతూ "ఈ నెల 31వ తేదీ ఉదయం నెల్లూరు వి.ఆర్.సి. వద్ద నుంచి సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వరకు పాదయాత్ర నిర్వహించనున్నాము. ఈ పాదయాత్రలో విద్యార్థులు, స్వచ్ఛంద సేవకులు, యువజన సంఘాలు, ప్రభుత్వ ఉద్యోగులు అందరూ పాల్గొని ఐక్యతా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి" అని తెలిపారు. తదుపరి రిజిస్ట్రార్ డా.సునీత మాట్లాడుతూ "పటేల్ గారి త్యాగాలు, నాయకత్వం దేశ ఐక్యతకు పునాది వేశాయి. యువత ఆయన స్ఫూర్తిని అనుసరించాలని" అన్నారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసులు మాట్లాడుతూ "సర్దార్ వల్లభాయ్ పటేల్ ఐక్యతా సూత్రాలను పాటించడం ద్వారా యువత దేశాభివృద్ధికి దోహదపడాలి. వి.ఎస్.యూ తరఫున అన్ని కళాశాలల్లో పటేల్ జయంతిని ఘనంగా నిర్వహిస్తాం" అని ప్రకటించారు.

# మోంథా తుఫాన్ నష్టాల అంచనాలు సిద్ధం చేయండి : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** భారీ వర్షానంతర పరిస్థితుల్లో వివిధ శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రాథమిక నివేదికలు తయారు చేయుటలో శ్రద్ద చూపాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణం లో వివిధ శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ తుఫాన్ అనంతర పరిస్థితి పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాలు తగ్గుముఖం పట్టిన పరిస్థితుల్లో గ్రామాల్లో పారిశుద్యం పై ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలన్నారు. అంటు వ్యాధులు ప్రబలకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పునరావాస కేంద్రాలలోని వారికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. అదేవిధంగా వర్షాలకు నానిన పాఠశాలల ప్రహరీ గోడలు, తదితరాల పరిస్థితులను పరిశీలించాలని విద్యా శాఖ అధికారిని ఆదేశించారు. అలాగే మరో రెండు రోజుల పాటు భారీ వర్షాల ప్రభావిత ప్రాంతాల్లో కూరగాయలు అమ్మకాలను కొనసాగించాలని మార్కెటింగ్ శాఖ అధికారులకు సూచించారు. అలాగే రోడ్లు, కల్వర్టు దెబ్బ తిన్న ప్రాంతాలను గుర్తించి నష్టం అంచనాల నివేదికలు సిద్ధం చేయాలన్నారు.



అన్ని శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రాథమిక నివేదికలు తయారు చేయుటలో ప్రత్యేక శ్రద్ద చూపాలన్నారు. ఈ సమావేశం లో డి ఆర్ ఓ విజయ్ కుమార్, డి పి ఓ శ్రీధర్ రెడ్డి, డి టి సి చందర్, డి ఈ ఓ బాలాజీ రావు, జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, హార్టికల్చర్ అధికారి సుబ్బారెడ్డి, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ ఈలు దేశ్ నాయక్, గంగాధర్, విజయ్ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ పటేల్ 150వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం

**- అందరూ భాగస్వాములు కావాలని వీఎస్‌యూ వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు విజ్ఞప్తి 31న నెల్లూరులో, నవంబర్ 7న కావలిలో ఐక్యతా పాదయాత్రలు**



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** భారత దేశపు ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) వైస్ చాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 'మేర యువ భారత్' ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరు నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ, జాతీయ ఐక్యత కోసం పటేల్ చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆయన ఐక్యతా సూత్రాలను పాటించడం ద్వారా నేటి యువత దేశాభివృద్ధికి దోహదపడాలని సూచించారు. వీఎస్‌యూ తరఫున అన్ని అనుబంధ కళాశాలల్లో పటేల్ జయంతిని ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. వేడుకల్లో భాగంగా ఈ నెల 31వ తేదీ నెల్లూరు నగరంలో, అలాగే నవంబర్ 7వ తేదీ కావలిలో పాదయాత్రలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్ర రెడ్డి మాట్లాడుతూ, "ఈ నెల 31వ తేదీ (జాతీయ ఐక్యతా దినోత్సవం) ఉదయం నెల్లూరు వి.ఆర్.సి. సెంటర్ వద్ద నుంచి సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వరకు పాదయాత్ర నిర్వహించనున్నాము. ఈ పాదయాత్రలో విద్యార్థులు, స్వచ్ఛంద సేవకులు, యువజన సంఘాలు, ప్రభుత్వ ఉద్యోగులు అందరూ పాల్గొని ఐక్యతా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి" అని కోరారు. వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ సునీత మాట్లాడుతూ, "పటేల్ గారి త్యాగాలు, దార్శనిక నాయకత్వం దేశ ఐక్యతకు పటిష్టమైన పునాది వేశాయి. యువత ఆయన స్ఫూర్తిని అనుసరించి ముందుకు సాగాలి'' అని అన్నారు. ఈ సమావేశంలో జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్) కో ఆర్డినేటర్ డా. అల్లం ఉదయ్ శంకర్, యన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీస్ డా. వెంకట సుబ్బారెడ్డి, కమ్యూనికేషన్ అధికారి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# 'సేవే మన ధర్మం - సమాజానికి అండగా జమ్మలమడక నాగమణి'

**- మొంథా తుపాను బాధితులకు అండగా సేవా కార్యక్రమాలు - గ్లోబల్ హెల్పింగ్ ఆర్మీ, కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆహారం, పళ్లు, బిస్కెట్లు పంపిణీ - పునరావాస కేంద్రాలలో ప్రజలకు ఆదరణ, భరోసా కల్పించిన నాగమణి**



**కాకినాడ, (రాజధాని వార్తలు):** మొంథా తుపాను ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు బాసటగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి నిలిచారు. "సేవ సామాజిక బాధ్యతగా భావించాలనే స్ఫూర్తితో ఆమె ఆధ్వర్యంలో కాకినాడ, చీరాల పరిధిలో విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వ హించారు. జమ్మలమడక నాగమణి గౌరవాధ్య క్షురాలిగా వ్యవహరిస్తున్న కాకినాడ గ్లోబల్ హెల్పింగ్ ఆర్మీ ఫౌండేషన్ మరియు చీరాల కృతి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పునరావాస కేంద్రాలు, ప్రభుత్వాస్పత్రుల్లో ఉన్న బాధితులకు వేడి వేడి ఆహారం, పళ్లు మరియు బిస్కెట్లు పంపిణీ చేశారు. సుమారు 500 మంది బాధితులకు ఇంట్లో వండించిన రుచికరమైన భోజనం అందించడం విశేషం. కాకినాడ ప్రభుత్వాస్పత్రి, చీరాల మండలం చినగం జాం ఆసుపత్రి, అంధుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో బాధితులను పరామర్శించిన నాగమణి మాట్లాడుతూ మానవత్వమే మతం సేవే పరమావధి. ప్రతి ఒక్కరు తమ సామర్థ్యానికి తగ్గట్టు సమాజానికి తోడ్పడాలి" అని పిలుపునిచ్చారు. ప్రభుత్వం సూచించినట్లు తుపాను ప్రభావం పూర్తిగా తగ్గే వరకు ప్రజలు పునరావాస కేంద్రాల్లోనే సురక్షితంగా ఉండాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమాల్లో గ్లోబల్ హెల్పింగ్ ఆర్మీ ఫౌండేషన్, కృతి ఫౌండేషన్ సభ్యులు, వాలంటీర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సేవా భావనతో ముందుకు సాగుతున్న జమ్మలమడక నాగమణి చర్యలకు స్థానికులు అభినందనలు తెలుపుతున్నారు.

# "కాకాణి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణకు అనూహ్య స్పందన"

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సర్వేపల్లి నియోజకవర్గం, మనుబోలు మండలం కేంద్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రివర్యులు మరియు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి. జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తుంది. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఒక్కో నియోజకవర్గం నుండి 60వేల సంతకాలను ప్రజల నుండి సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. కూటమి ప్రభుత్వం తీసుకున్న మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో మొదలుపెట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ప్రజల నుండి అనూహ్య ఆదరణ లభిస్తుంది. చంద్రబాబు కమిషన్లకు కక్కుర్తి పడి, జగన్మోహన్ రెడ్డి రాష్ట్రానికి తీసుకుని వచ్చిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడుతున్నాడు. జగన్మోహన్ రెడ్డి తెచ్చిన 17 మెడికల్ కళాశాలలో 7 మెడికల్ కళాశాలలు నిర్మాణాలు పూర్తి చేసుకొని, 10 మెడికల్ కళాశాలలు వివిధ దశలలో పురోగతిలో ఉన్నాయి. జగన్మోహన్ రెడ్డి తెచ్చిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పూర్తి చేస్తే, పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించడంతోపాటు, వాటికి అనుసంధానంగా ఏర్పాటయ్యే ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల ద్వారా పేదలకు నాణ్యమైన వైద్యం అందుతుంది. జగన్మోహన్ రెడ్డి ఉన్నత ఆశయంతో ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలను నీరుగార్చే విధంగా, చంద్రబాబు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాడు. చంద్రబాబు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాన్ని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని సర్వేపల్లి నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి తీసుకొని వెళ్తాం. ప్రజల నుండి సేకరించిన కోటి సంతకాలను జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర గవర్నర్ కి వినతి పత్ర రూపంలో అందించి, ప్రైవేటీకరణను అడ్డుకుంటాం. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా, భారీగా తరలివచ్చి, కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మనుబోలు గ్రామ ప్రజలకు, స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నా.

# తల్లి సాధించలేనిది కుమార్తె రూపంలో!



తల్లిదండ్రులు సాధించలేనిది కనీసం పిల్లల రూపంలో సాధించాలని ఎన్నో కలలు కంటుంటారు. పిల్లలు కూడా అంతే విధిగా తల్లిదండ్రుల మాటకు కట్టుబడి ఉంటారు. అలాగని పిల్లలందరూ ఒకేలా ఉండలేరు. తల్లిదండ్రులు ఇచ్చిన స్వేచ్ఛ మేరకు కాల క్రమంలో కొన్ని రకాల మార్పులు చోటు చేసుకోవడం సహజం. తల్లిదండ్రుల కోర్కెలు పిల్లలు నెరవేర్చలేదు అని చెప్పడానికి వీలు లేదు. వారికంటూ కొన్ని కోరికలు..కలలు ఉంటాయి. వాటిని సాధించుకునే దిశగానూ కొంత మంది పిల్లలు అడుగులు వేస్తుంటారు. తల్లిదండ్రుల కోరికలు మాత్రం పిల్లల రూపంలో నెరవేరితే అంతకు మించిన అదృష్ట తల్లిదండ్రులు మరొకరు లేనట్లే. తాజాగా మంజుల ఘట్టమనేని కుమార్తె, మహేష్ మేనకోడలు జాన్వీ హీరోయిన్ గా తెరంగేట్రం చేస్తోన్న సంగతి తెలిసిందే. పదేళ్ల వయసులోనే జాన్వీకి మ్యాకప్ వేసారు మంజుల. మనసుకు నచ్చింది సినిమాతో లాంచ్ చేసారు. కానీ ఆ తర్వాత కొనసాగలేదు. అప్పుడే సినిమాల మీద దృష్టి మళ్లీస్తే చదువు సరిగ్గా ఉండదని ఆ సినిమాకే పరిమితం చేసారు. అయితే ఆ వయసులో తల్లి అలా లాంచ్ చేయడమే జాన్వీకి సినిమాలపై మనసు మళ్లింది. అందుకే ఇప్పుడు నటిగా ఎంట్రీ ఇస్తుంది. అయితే జాన్వీని వెండి తెరపై హీరోయిన్‌గా చూసుకోవాలన్నది ఆమె కన్నా తల్లి మంజుల కన్న గొప్ప కలగా కనిపిస్తోంది. మంజుల చిత్ర రంగంలోకి 1990లోనే నిర్మాతగా ఎంట్రీ ఇచ్చారు. ఐదారు సినిమాలు నిర్మించారు. అదే సమయంలో షో సినిమాతో తెలుగులో నటిగా లాంచ్ అయ్యారు. అంతకుముందు ఓ మలయాళ చిత్రంలో నటించారు. ఆ మరుసటి ఏడాది రాజస్థాన్ అనే తమిళ సినిమాలోనూ నటించారు. అటుపై మూడేళ్ల గ్యాప్ అనంతరం షోతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత కావ్యాస్ డైరీలో మంజుల నటించారు. ఆ తర్వాత ఆరెంజ్, సేవకుడు, మళ్లీ మొదలైంది, హంట్, మంథ్ ఆఫ్ మధులో కీలక పాత్రలు పోషించారు. అలా నటనపై తనకున్న ఫ్యాషన్ చాటుకున్నారు మంజుల. కానీ నటిగా, హీరోయిన్‌గా మాత్రం మంజుల తాను అనుకున్న హైట్స్‌కు చేరలేదు. ఓ క్యారెక్టర్ ఆర్టిస్ట్ గానే మిగిలిపోయారు. అప్పటి నుంచి మంజుల హీరోయిన్ కోరిక అలాగే మిగిలిపోయింది. ఇప్పుడా డ్రీమ్‌ను కుమార్తె జాన్వీ రూపంలో తీర్చుకోబొతున్నారు. అందుకే జాన్వీ 10 ఏళ్ల వయసులోనే తాను దర్శకత్వం వహించిన మనసుకు నచ్చింది తెరంగేట్రంతో బీజం వేసారు. మామ్ కల కోసం డాటర్ కూడా అంతే కష్టపడింది. చిన్న వయసులోనే డాన్సు, నటన వంటి వాటిపై శిక్షణ ఇప్పించడం జరిగింది.

# రవితేజ ల్యాండ్ మార్క్ సింపుల్‌గానే!



స్టార్ హీరోల ల్యాండ్ మార్క్ చిత్రాలంటే ప్రత్యేకమైన ప్లానింగ్ ఉంటుంది. ల్యాండ్ మార్క్ సినిమాలంటే రెగ్యులర్ సినిమాలకంటే రెట్టించిన అంచనాలు నెలకొంటాయి. ఈ నేపథ్యంలో హీరోలు ఇలాంటి సినిమాల విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తుంటారు. కథ ప్రత్యేకంగా ఉండాలని... డైరెక్టర్ సీనియర్ అయి ఉండాలని..నిర్మాణ సంస్థ అగ్రగామిదై ఉండాలని చాలా మంది స్టార్లు భావిస్తుంటారు. కానీ మాస్ రాజా రవితేజకు మాత్రం అలాంటి దేమి ఉండదని తెలుస్తోంది. ఏదైనా అది మంచి సినిమా అయితే చాలు అన్న తీరులో కనిపిస్తున్నారు. ప్రస్తుతం రవితేజ హీరోగా మాజ్ జాతర రిలీజ్‌కు రెడీ అవుతోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా నెంబర్ ఎంతో తెలుసా? అక్షరాల 75వ చిత్రం అవును. ఈ విషయాన్ని డైరెక్టర్ భాను భోగవరపు చెప్పే వరకూ గానీ విషయం వెలుగులోకి రాలేదు. మాస్ జాతర 75వ చిత్రమని తనకి కూడా తెలియదన్నాడు. ఓసారి వికీలోకి వెళ్లి రవితేజ నటించిన సినిమాలన్నీ లెక్కిస్తే మాస్ జాతర 75వ నెంబర్ చ్చిందని తెలిపారు. ఇదే విషయాన్ని రవితేజకు చెబితే నెంబర్ గురించి ఆలోచించొద్దని ప్రశాంతంగా సినిమా తీసుకోమని సెలవిచ్చారు. కథ బాగున్నప్పుడు దేని గురించి ఆలోచించొద్దని చెప్పడంతోనే తాను అనుకున్నది అనుకున్నట్లు తీయగలరు. మాస్ కథే అయినా రవితేజ మార్క్ హాస్యం మాత్రం పుష్కలంగా ఉంటుందన్నారు. భాను భోగవరపు దర్శకుడిగా ఇదే తొలి సనిమా. అసోసియేట్ డైరెక్టర్‌గా పని చేసిన అనుభవం ఉంది. మంచి రైటర్‌గానూ ఇండస్ట్రీలో గుర్తింపు ఉంది. అది చూసిన రవితేజ.. భాను డైరెక్టర్ అవ్వడానికి ఈ క్వాలిపికేషన్స్ చాలు అని భావించి మాస్ జాతర కథ చెప్పగానే నచ్చడంతో ఒకే చేసినట్లు తెలుస్తోంది. కొత్త వాళ్లకు అవకాశాలివ్వడంలో రవితేజ పెద్దగా ఆలోచించరు. అసిస్టెంట్..అసోసియేట్ డైరెక్టర్ పనిచేసిన అనుభవం ఉండి..రైటర్‌గా గుర్తింపు ఉంటే రాజా ఛాన్స్ ఇస్తరు. ఇప్పటి వరకూ చాలా మందికి దర్శకులుగా అవకాశం ఇచ్చారు. వాళ్లంతా డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో పని చేసినవారే. రవితేజ ఇలా అవకాశాలివ్వడానికి ఓ కారణం ఉంది. రవితేజ కూడా హీరో కాకముందు డైరెక్షన్ డిపార్ట్ మెంట్లో పని చేసారు. అదే సమయంలో వివిధ శాఖల్లోనూ అనుభవం సంపాదించారు. నిజాయితీగా కష్టపడేవారు ఎలా ఉంటారు? మ్యానేజింగ్ చేస్తూ కాలక్షేం చేసేవారు ఎలా ఉంటారు? అన్నది రాజాకి బాగా తెలుసు. అందుకే కష్టాన్ని నమ్మిన అసిస్టెంట్లకు అవకాశాలు కల్పిస్తున్నారు.

# కృతి శెట్టి ఇంకా వెయిటింగ్‌లోనే..?



ఉప్పెన భామ కృతిశెట్టి తొలి సినిమాతో సెన్సేషనల్ హిట్ అందుకుని ఆ తర్వాత ఏమాత్రం ఇంపాక్ట్ చూపించలేకపోయింది. ఉప్పెన ఆ తర్వాత శ్యామ్ సింగ రాయ్, బంగార్రాజు ఈ 3 సినిమాలు అమ్మడికి మంచి బజ్ తీసుకు రాగా ఇక ఆ తర్వాత చేసిన ప్రతి సినిమా గ్రాఫ్ పడిపోయేలా చేసింది కానీ అమ్మడికి ఏమాత్రం వర్క్ అవుట్ అవ్వలేదు. చివరగా మనమే అంటూ శర్వానంద్‌తో ఒక అటెంప్ట్ చేసింది. అది కూడా ఆడియన్స్‌ని ఏమాత్రం ఇంప్రెస్ చేయలేకపోయింది. బేబమ్మగా పాపులారిటీ తెచ్చుకున్నా కూడా కృతికి అసలు ఛాన్స్‌లు రావట్లేదు. ఐతే తెలుగులో ఎలాగు అవకాశాలు లేవని అమ్మడు తమిళ్‌లో తన ప్రయత్నాలు మొదలు పెట్టింది. రవి మోహన్ తో జినీ సినిమా ఏడాది క్రితమే చేసినా అది ఇంకా రిలీజ్ కాలేదు. డిసెంబర్‌లో ఆ సినిమా రిలీజ్ ఉండొచ్చని తెలుస్తుంది. మరోపక్క యూత్ స్టార్ ప్రదీప్ రంగనాథన్‌తో ఎల్.ఐ.కె అంటూ మరో సినిమా చేసింది కృతి శెట్టి. ఆ సినిమా అసలైతే ఈ దీవాళీకి రిలీజ్ అవ్వాల్సింది కానీ డ్యూడ్ రిలీజ్ ఉండటం వల్ల ప్రదీప్ ఎల్.ఐ.కె వాయిదా పడింది. ప్రదీప్ డ్యూడ్ కూడా సూపర్ హిట్ అయ్యింది కాబట్టి కృతి శెట్టి ఎల్.ఐ.కె మీద తన హెూప్స్ అన్ని పెట్టుకుంది. అంతేకాదు ప్రదీప్ సినిమాలు తెలుగులో కూడా మంచి బజ్ ఏర్పరచుకుంటున్నాయి. అలా బేబమ్మ మళ్లీ టాలీవుడ్‌లో తనపై డిస్కషన్ జరగాలని చూస్తుంది. ప్రస్తుతం టాలీవుడ్‌లో తనకు సరైన ఛాన్స్ రాబట్టుకునే వరకు పట్టు వదలట్లేదు అమ్మడు. గ్లామర్‌తో బుట్టలో పడేయాలనే ప్లాన్.. ఈమధ్య సోషల్ మీడియా ఫోటో షూట్స్‌లో కూడా తన స్కిన్ షోతో ఎట్రాక్ చేస్తుంది. ఫోటో షూట్స్ వల్ల ఛాన్స్‌లు వస్తాయా అన్నది కన్ఫర్మ్‌గా చెప్పడం కష్టం కానీ ఆడియన్స్‌కి తన గ్లామర్‌తో బుట్టలో పడేయాలనే ప్లాన్ మాత్రం చాలా మంది హీరోయిన్స్‌కి బాగానే వర్క్ అవుట్ అయ్యింది. ఎల్.ఐ.కె, జినీ రెండు సినిమాలు కూడా డిసెంబర్ లోనే రిలీజ్ టార్గెట్ పెట్టుకున్నాయి. ఈ రెండు సినిమాలు సక్సెస్ ఐతే కోలీవుడ్‌లో అయినా బిజీ అవ్వాలని చూస్తుంది కృతి శెట్టి. ఐతే పాన్ ఇండియా సినిమాలు చేస్తున్న టాలీవుడ్ మీదే కృతి ఫస్ట్ ఫోకస్ చేస్తుందని తెలుస్తుంది. ఐతే ఉప్పెన హిట్ తర్వాత వచ్చిన ప్రతి ఛాన్స్‌ని కాదనకుండా చేసిన అమ్మడు ఆ టైంలోనే కాస్త ఆచి తూచి స్టోరీస్ ఎంపిక చేసుకుని ఉంటే ఇప్పుడు ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదని చెప్పొచ్చు.

# కొత్త గెటప్‌లో ఆషికా రంగనాథ్! ఆషికా రంగనాథ్



ఆషికా రంగనాథ్.. ఈ హీరోయిన్ తెలుగులో చేసినవి 2 సినిమాలే అయినప్పటికీ స్టార్ హీరోయిన్ మాదిరి గుర్తింపు సంపాదించింది.. అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మకి సంబంధించిన తాజా ఫొటోస్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి. ఎప్పుడు పొట్టి పొట్టి బట్టలతోనో లేక ట్రెడిషనల్ డ్రెస్‌లతోనో కనిపించే ఆషికా రంగనాథ్ ఒక్కసారిగా గెటప్ చేంజ్ చేసే సరికి ఈ హీరోయిన్ ఫొటోస్ చూసిన అభిమానులు సైతం షాక్ అవుతున్నారు. ఇదేంటి ఈ హీరోయిన్ గెటప్ మార్చేసింది.. ఈ కొత్త గెటప్ ఏంటో అంటూ ఆశ్చర్యపోతున్నారు. ఇక తాజాగా ఆషికా రంగనాథ్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో కొన్ని ఫొటోస్ షేర్ చేసింది.ఆ ఫొటోస్ లో ఆషికా రంగనాథ్ గెటప్ పూర్తిగా చేంజ్ అయింది. హాలీవుడ్లో పైరేట్స్ ఆఫ్ ది కరేబియన్ అనే సినిమాలో హీరో ఎలా అయితే ఉంటారో అచ్చం ఆ హీరోని పోలి ఉన్న గెటప్‌లో ఆషికా రంగనాథ్ తాజా ఫోటోలు ఉన్నాయి. తలకి బ్యాండ్ కట్టుకొని హెయిర్ లీవ్ చేసుకొని ఆషికా రంగనాథ్ ఫోటోలకు ఫోజులు ఇచ్చింది. ఈ ఫోటోలు చూస్తూ ఉంటే మాత్రం ఆషికా రంగనాథ్ ఏదో స్టంటులు చేసేవారు ఫోటోలకు ఫోజులు ఇచ్చినట్లుగా ఉంది అంటూ నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు. ఇక ఆషికా రంగనాథ్ పోస్ట్ చేసిన ఫోటోలలో వెనుక ఉన్న బ్యాక్గ్రౌండ్ కూడా అలాగే ఏదో యాక్షన్ మూవీ సెట్ వేసినట్టు కనిపిస్తోంది. చూస్తుంటే ఆషికా రంగనాథ్ కొత్త సినిమా కోసం అలా తన గెటప్ ని చేంజ్ చేసినట్టు కనిపిస్తోంది. మరి ఆషికా రంగనాథ్ తాజా ఫొటోస్ కొత్త సినిమా గెటప్‌లో భాగమేనా అనేది తెలియాల్సి ఉంది. ఇక ఈ ఫొటోస్ షేర్ చేయడంతో పాటు ఈ ఫొటోస్‌కి క్యాప్షన్‌గా ఈ మొత్తం లుక్ వెనక ఉన్న బృందానికి లవ్ యు అన్నట్లుగా ఫింగర్ హాట్ సింబల్ ఎమోజిని కూడా షేర్ చేసింది.. ప్రస్తుతం ఆషికా రంగనాథ్‌కి సంబంధించిన తాజా ఫొటోస్ ఇంటర్నెట్‌ని షేక్ చేస్తున్నాయి. మరి హీరోయిన్ సడెన్‌గా గెటప్ చేంజ్ వెనుక కారణం ఏంటో తెలియాల్సి ఉంది. ఆషికా రంగనాథ్ సినిమాల విషయానికి వస్తే.. క్రేజీ బాయ్ అనే మూవీ తో కన్నడ ఇండస్ట్రీ లోకి హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిన ఆషికా రంగనాథ్ ఆ తర్వాత పలు కన్నడ సినిమాల్లో నటించి పట్టదు అరసు అనే తమిళ మూవీలో కూడా నటించింది. ఆషికా రంగనాథ్ మొదటి తెలుగు సినిమా అమిగోస్..కళ్యాణ్ రామ్ హీరోగా వచ్చిన అమిగోస్ సినిమా ద్వారానే ఆషికా రంగనాథ్ టాలీవుడ్లోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమా తర్వాత అక్కినేని నాగార్జున నటించిన నా సామి రంగ మూవీలో హీరోయిన్ గా అవకాశం అందుకొని ఈ సినిమాతో పాపులర్ నటిగా పేరు తెచ్చుకుంది. ప్రస్తుతం ఈ హీరోయిన్ మెగాస్టార్ చిరంజీవి నటించిన విశ్వంభర మూవీలో కూడా ఓ ముఖ్యమైన పాత్రలో నటించింది.. ఆషికా రంగనాథ్ అప్ కమింగ్ సినిమాల గురించి చూసుకుంటే.. తమిళంలో కార్తీతో సర్దార్ -2 మూవీలో హీరోయిన్‌గా నటిస్తోంది. అలాగే కన్నడలో గాథ వైభవ అనే మూవీలో కూడా నటిస్తోంది.

# వరద బాధితులకు అండగా నిలిచిన మంత్రి నారాయణ

**- అధికారులకు, టిడిపి శ్రేణులకు మంత్రి నారాయణ ప్రశంసలు - టెలికాన్ఫరెన్స్‌లో మంత్రికి అందుబాటులో ఉంటున్న అధికారులు, టిడిపి శ్రేణులు - నగర శివారు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించిన టిడిపి శ్రేణులు - గుడిసెల్లో నివసిస్తున్న వారికి తాత్కాలిక ఉపశమనం కింద సొంత నిధులతో టార్పాలిన్ పట్టలు పంపిణీ - విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అందుబాటులో ఉండేలా దిశా నిర్దేశం చేసిన మంత్రి నారాయణ**






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** తుఫాన్ లాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలను ఆదుకునేందుకు ఇటు అధికారులు అటు టిడిపి శ్రేణులు చేసిన సేవలు అభినందనీయమని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ ప్రశంసించారు. నెల్లూరు నగర శివారు ప్రాంతాల్లో గుడిసెల్లో నివాసం ఉంటున్న వారికి మంత్రి నారాయణ ఆదేశాల మేరకు మంత్రి సొంత నిధులతో టార్పాలిన్ పట్టలను టిడిపి శ్రేణులు పంపిణీ చేశారు. అదేవిధంగా పునరావాస కేంద్రాల్లో ఉంటున్న వారికి ఉదయం టిఫిన్ మధ్యాహ్నం, సాయంత్రం భోజనం ఏర్పాట్లపై అధికారులతో టిడిపి శ్రేణులు క్షేత్రస్థాయిలో సమీక్షించారు. తుఫాన్ లాంటి పరిస్థితుల్లో ప్రజలను అన్ని విధాల ఆదుకోవాల్సిన బాధ్యత తమపై ఉందంటూ మంత్రి నారాయణ ఇచ్చిన ఆదేశాల మేరకు అధికారులు, టిడిపి శ్రేణులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి వానలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు సహాయక చర్యలు చేపట్టారు. ఇబ్బందుల్లో ఉన్నవారికి భరోసా కల్పించారు. మొంధా తుఫాన్ తీరం దాటడంతో నెల్లూరు నగరంలో ప్రస్తుత పరిస్థితిని మంత్రి నారాయణ కు అధికారులు, టిడిపి శ్రేణులు తెలియజేస్తున్నారు. అమరావతిలోని ఆర్టీజిఎస్ నుంచి ఒక పక్క తుఫాన్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సమీక్షల్లో పాల్గొంటూ ,మరో పక్క వరుస టెలి కాన్ఫరెన్స్‌ల ద్వారా నెల్లూరు అధికారులకు సూచనలు ఇస్తూ , క్షేత్రస్థాయిలో ప్రజలకు సహాయ సహకారాలు అందించేందుకు టిడిపి శ్రేణులను రంగంలోకి దింపారు ..వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సమన్వయంతో అధికారులు, టిడిపి శ్రేణులు చేసిన సేవలను మంత్రి నారాయణ అభినందించారు.

తుఫాన్ తీరం దాటినప్పటికీ వాతావరణ శాఖ హెచ్చరికలతో నెల్లూరు జిల్లా పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అధికారులకు మంత్రి పలు సూచనలు చేస్తున్నారు. మంత్రి నారాయణ సేవా దృక్పథాన్ని,కార్య దక్షతను నగరవాసులు కొనియాడుతున్నారు.

# అన్నదాతలందరినీ ప్రభుత్వం తరపున ఆదుకుంటాం


**- తుఫాన్ ప్రభావంతో నేలకొరిగిన పంటల పరిశీలన**

**- ఆత్రేయపురం మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**



**ఆత్రేయపురం, (రాజధాని వార్తలు):** మొంథా తుఫాను ప్రభావం వరి రైతులపై అధికంగా పడిందని, ఉద్యాన, కూరగాయల పంటలు సైతం దెబ్బతిన్నాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానం దరావు వ్యాఖ్యానించారు. బుధవారం ఆత్రేయపురం మండలం కట్టుంగ, నార్కెడిమిల్లి, వసంతవాడ, పులిదిండి, వద్దిపర్రు, వెలిచేరు గ్రామాల్లో ఎమ్మెల్యే బండారు, ఆర్డీవో పి శ్రీకర్ తో కల్సి క్షేత్రస్థాయిలో పర్యటించి అన్నదాతల ఇక్కట్లను పరిశీ లించారు. పంట కోతకు వచ్చే సమయానికి తుఫాన్ రావడంతో వరి పొలాలు నేలనంటాయని రైతులు ఎమ్మెల్యే బండారు వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదాతల కడగండ్లను చూసి ఎమ్మెల్యే బండారు చలించి పోయారు. ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుం టుందని ఆయన హామీ ఇచ్చారు. పంట నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందుతుందన్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థా యిలో పర్యటించి నమోదు చేసి పరిహారం అందేలా చేస్తారని వారికి తెలియజేశారు. వరి ఎకరాకు రూ. 8వేలు, అరటి ఎకరానికి రూ. 14వేలు, కూరగాయల పంటలకు ఎకరాకు రూ. 10వేలు నష్టపరిహారంగా అందించనున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించిందని తెలియజేశారు. కర్షకులకు అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం ముందు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, కుసంపూడి రామకృష్ణంరాజు, ముళ్ళపూడి భాస్కరరావు మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ అభయ గణపతి ప్రతిష్టాపన, అన్నసమారాధన మహోత్సవంలో మన సిరమ్మ

**విజయనగరం, (రాజధాని వార్తలు):** ధర్మపురిలో శ్రీ అభయ గణపతి ప్రతిష్టాపన మరియు అన్నసమారాధన ఆహ్వానం మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్, వై.యస్. ఆర్.సీ.పి.జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ బుధవారం ఉదయం గం. 10.00 లకు శ్రీ అభయ గణపతి ప్రతిష్టాపనలో పాల్గొన్నారు. అనంతరం గణపతి పూజ, పుణ్యాహవచనం, గవ్యాంత మార్చనలు, పునః పూజలు,ధాన్యాది వాసం,అగ్ని ప్రతిష్ట, ఆవాహిత దేవతా హవనములు,లక్ష్మీ గణపతిహోమం తదితర కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు, ముఖ్యనాయకులు, గ్రామ ప్రజలు, చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షులు తోట వాసు, చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


# ప్రజా విద్యా, వైద్యంపై కాసులేరుకుంటున్న కూటమి పాలకులు

**- సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ విమర్శ**



**విజయనగరం, (రాజధాని వార్తలు):** ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాల్సిన పాలకులు అందరికీ ఉచిత విద్యా, వైద్యం అనే హామీలు కేవలం కాగితాలకే పరిమితం చేసి ప్రజా విద్య, వైద్యం పై కూటమి ప్రభుత్వ పాలకులు కాసులేరుకుంటున్నారని సిపిఐ జిల్లా సహాయ బుగత అశోక్ విమర్శించారు. బుధవారం ఉదయం భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మార్కెట్ శాఖా సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన ప్రజారంగ సంస్థలను ప్రైవేటుపరం చేసి కార్పొరేట్ దోపిడీ వర్గాలకు అప్పజెప్పేస్తు చంద్రబాబు కూటమి ప్రభుత్వ చేతకానితనాన్ని నిరూపించుకుంటున్నారని దుయ్యబట్టారు. ఆంధ్ర రాష్ట్రంలో అందరికీ వైద్య విద్యను అభ్యసించడానికి అవకాశం కల్పించడానికి నేషనల్ మెడికల్ కౌన్సిల్ ను గత ప్రభుత్వం కోరిక మేరకు 17 మెడికల్ కాలేజీలు ప్రభుత్వరంగ సంస్థలో నడపడానికి అవకాశం కల్పిస్తూ నిధులు కల్పించిందన్నారు. ఆనాడు ఒకేసారి 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రారంభించడానికి ఆర్థిక పరిస్థితులు సరిపోవడం లేదని ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకున్నదన్నారు. అదేమిటంటే మొదటి విడతలో 5 కళాశాలలు, రెండవ విడత 5 కళాశాలలు, మూడో విడతలు 7 కళాశాలల్ని ప్రారంభిస్తామని ఆనాటి వైకాపా ప్రభుత్వం తెలిపిందన్నారు. విద్యార్థులకు ఇచ్చిన హామీలో భాగంగా మొదటి విడతలో 5 మెడికల్ కళాశాలల నిర్మాణం సకాలంలో పూర్తి చేసి మచిలీపట్నం, ఏలూరు, విజయనగరం, రాజమహేంద్రవరం, నంద్యాలలో ప్రారంభించడం జరిగిందన్నారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్నటువంటి టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ఇప్పటి విద్యాశాఖ మంత్రి యువగళం పాదయాత్ర చేసినప్పుడు వేలాది మంది విద్యార్థి యువతను సమీకరించి "ప్రస్తుతం అధికారంలో ఉన్నటువంటి వైకాపా ప్రభుత్వం వైద్య విద్యను అంగట్లో సరుకులాగా అమ్మేస్తున్నారు కాబట్టి మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే 100 రోజుల్లోనే ఈ జీవో నెంబర్ 107, 108 రద్దు చేస్తాను, వైద్య విద్యను ప్రతిఒక్క విద్యార్థికి అందేవిధంగా చొరవ చేపడతానని" హామీ ఇచ్చిన సంగతి అధికారం రాగానే లోకేష్ గార్కి మతి ఏమైందని ప్రశ్నించారు. గత ప్రభుత్వం కేవలం సెల్ఫ్ ఫైనాన్స్ కోట పేరుతో 50 పర్సెంట్ సీట్లను కార్పొరేట్ విధానంగా నడిపారు కానీ ఇప్పుడు అధికారంలో ఉన్నటువంటి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏకంగా పి.పి.పి పద్ధతిలో పబ్లిక్, ప్రైవేట్, పార్ట్నర్షిప్ భాగస్వామ్యం అనే పాలకుల జేబులు నింపుకోవడానికి ఈ దుర్మార్గ విధానంతో ఏకంగా కళాశాలలన్నీ కూటమి ప్రభుత్వం కార్పొరేట్లకు అప్పనంగా కట్టబెట్టేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవడి సొమ్ముని ఎవడికి దానధర్మం చేస్తున్నారని మండిపడ్డారు. ఒక ఎకరా ప్రభుత్వ భూమిని 99 రూపాయలకు ఇస్తారా..? ప్రజలు ఓట్లేసి గెలిపించి మిమల్ని నమ్మి గద్దెనెక్కిస్తే ప్రజలకు, ప్రజల ఆస్తులకు రక్షణ ఉండి సమర్థవంతంగా నడిపించడం చేతకాక ప్రజారంగ సంస్థలపైన, భూములపైన కార్పొరేట్లకు పెత్తనం ఇస్తూ నిస్సిగ్గుగా 66 సంవత్సరాలకు లీజు అగ్రిమెంట్ ఇస్తారా అని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని కూడా నడపలేమని ప్రైవేటోడికి అప్పగించేసి ప్రజాప్రతినిదులందరూ ఇళ్ళ దగ్గరే ఉండిపోతే సరిపోతుందని విమర్శించారు. మీకు విద్యార్థి, యువత మరియు ముఖ్యంగా వారి యొక్క తల్లిదండ్రులు ఓట్లు వేసి పరిపాలన చేసే అవకాశం కల్పించింది కేవలం 5 సంవత్సరాలు మాత్రమే కానీ 66 సంవత్సరాలు కాదని చంద్రబాబు నాయుడు జ్ఞప్తికి తెచ్చుకోవాలని హితవు పలికారు. మీరు తీసుకుంటున్న నియంతృత్వ విధానాల వలన బడుగు బలహీనవర్గాల, మధ్యతరగతి విద్యార్థులకు తీరని శాపంగా మారుతోందన్నారు. డబ్బు ఉన్నవాడు కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి లేదా వారి పలుకుబడిని ఉపయోగించి అప్పులు చేసి మరీ విద్యను అభ్యసించి వైద్యునిగా స్థిరపడిన తర్వాత కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి ఆధునిక భవనాలు, వైద్య యంత్ర పరికరాలు ఏర్పాటు చేసి పెట్టుబడిగా పెట్టి వైద్యరంగాన్ని వ్యాపారంగా తయారై పేద, మధ్య తరగతి ప్రజలను కార్పొరేట్ వైద్యం పేరుతో రక్తం పీల్చే జలగల్ల దోపిడీ చేస్తుండటం మీ కళ్ళకి కనబడలేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి సామాజిక, ఆర్థిక దోపిడీ విధానాలకి అడ్డుకట్ట వేయాలంటే ఆంధ్రప్రదేశ్ లో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని మీ పాలకులు సుదీర్ఘంగా చర్చించి అవసరమైతే అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసి ఆ వైపుగా తీర్మానం చేసి ఆమోదం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకి శ్రీకారం చుడతామని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించారు.

# అలుపెరగని ప్రజాసేవకుడు మొకర నారాయణరావు: టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు



**భీమునిపట్నం, (రాజధాని వార్తలు):** సుదీర్ఘ రాజకీయ జీవితంలో ప్రజలతో మమేకమై ఎన్నో సమస్యల పరిష్కానికి నాంది పలికిన గొప్ప ఆదర్శ రాజకీయ నాయకుడు మొకర నారాయణరావు అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. మొకర నారాయణరావు 91వ జయంతి సందర్భంగా భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి భీమిలి జోన్ 3వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో గంటా నూకరాజు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి ఒకే రాజకీయ పార్టీలో సభ్యత్వం తీసుకొని చివర వరకు అదే పార్టీకి తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప రాజకీయ నీతిజ్ఞుడు మొకర నారాయణరావు అని కొనియాడారు ఆయన పార్టీ కోసం చేసిన సేవలకు గాను భీమిలి వైస్ చైర్మన్‌గా, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, వుడా డైరెక్టర్‌గా ఎన్నో పదవులు ఆయన్ని వరించాయని అన్నారు. ఎన్ని పదవులు పొందినా ఒదిగి ఉండేవారని భీమిలిలో యువతకు రాజకీయ చైతన్యానికి నాంది పలికిన ఒకేఒక్కడు మొకర నారాయణరావు అని గంటా నూకరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చురకల రమణ, మారోజు సంజీవ్ కుమార్, వాడమొదలు సత్యారావు, కొక్కిరి అప్పన్న, సంకురుభుక్త జోగారావు, రాజగిరి రమణ, జలగడుగుల మురళి, కుప్పిల గురుమూర్తి, కృష్ణారావు మాస్టర్, అప్పికొండ నర్సింగరావు, వియ్యపు పోతురాజు, కొక్కిరి నూకరాజు, వాడమొదలు తవుడయ్య, మొకర నీలకంఠం, సూర్యనారాయణ మాస్టర్, వెంకటరావు పాల్గొన్నారు.



# పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా "మెగా రక్తదాన శిబిరం"


**భద్రాచలం, (రాజధాని వార్తలు):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఆధ్వర్యంలో భద్రాచలం డివిజన్ పోలీస్ శాఖ అక్టోబర్ 31 శుక్రవారం భద్రాచలం పట్టణంలోని అన్నపూర్ణ ఫంక్షన్ హాల్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పట్టణ సిఐ యం నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదానం అనేది ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి పునర్జన్మను ప్రసాదిస్తుందని అన్నారు. ఈ రక్తదాన శిబిరంలో యువత, విద్యార్థులు, ప్రతి ఒక్కరు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# తుఫాన్ తీరం దాటింది – గండం గడిచింది

## - వేగవంతంగా ప్రభుత్వం సహాయక చర్యలు - ఫలించిన ప్రభుత్వం తుఫాన్ ముందస్తు చర్యలు

## - నేల కొరిగిన భారీ వృక్షాలు విద్యుత్ స్తంభాలు - అధికంగా వరి పంటకు నష్టం









**కొత్త పేట, (రాజధాని వార్తలు):** మోందా తుఫాను తీరం దాటింది. కోనసీమ వాసులు ఊపిరి పీల్చుకున్నారు. ఇదే నెలలో 1996లో తుఫాను చూసిన వారు భయభ్రాంతులకు లోనయ్యారు. చెదురు ముదురు సంఘటనలు తప్ప మొత్తం మీద ప్రశాంతంగా తుఫాన్ తీరం దాటింది. ప్రభుత్వ ముందస్తు చర్యలు ఫలితాన్నిచ్చాయి. అధికార యంత్రాంగం మొత్తం అప్రమత్తమయ్యారు. ప్రజలను ఇళ్ల నుండి బయటకు రాకుండా జాగ్రత్త వహించారు. పోలీస్ సిబ్బంది పహార కాశారు. ప్రభుత్వ అధికారులు తుఫాను సహాయక చర్యలను వేగవంతం చేశారు. నేలకొరిగిన చెట్లను ఎప్పటికప్పుడు తొలగించారు. తుఫాన్ ప్రభావం మొట్టమొదట కనిపించే విద్యుత్తును క్రమబద్ధకరించేందుకు రాత్రి నుండి కంటిమీద కునుకు లేకుండా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇబ్బందులు లేని చోట వెంటనే విద్యుత్తును అందించారు. విద్యుత్తును అందించగలిగితే సామాన్య పరిస్థితిలు నెలకొన్నట్టేగానే భావించవచ్చు. అంతలా విద్యుత్ ప్రభావం ప్రజలపై ఉంటుంది. సామాన్యుల దగ్గర నుంచి అందరికీ విద్యుత్తుతో సంబంధాలు ముడిపడి ఉన్నాయి. తుఫాను నష్టం అంచనాలు అందించడంలో రెవెన్యూ సిబ్బంది తల మునకలై ఉన్నారు. వారి బాధ్యతను వారు నెరవేరుస్తున్నారు. విపత్తులకు ఎదురు వెళ్లి ఎదుర్కొనటంలోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహాయక చర్యలను అందించడంలోను ఎప్పుడు ముందుంటారు. ఆయన అనుభవం ముందు తుఫాను కూడా జంకింది అని చెప్పాలి. నారా లోకేష్ రాత్రంతా నిద్రపోకుండా సహాయక చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనటంలో ప్రభుత్వం సఫలీకృతం అయిందని చెప్పాలి. సమర్ధవంతమైన ప్రభుత్వంలో ప్రజలు సురక్షితంగా ప్రశాంతంగా జీవిస్తారు అనడానికి ఉదాహరణగా తుఫాను ప్రభావాన్ని పేర్కొనవచ్చు..కొత్తపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తుఫాను సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. పార్టీ నేతలను అలర్ట్ చేసి సహాయక చర్యల్లో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.పునరావాస కేంద్రాల్లో ఉన్నవారిని పరామర్శించి ధైర్యాన్నిచ్చారు. మరోపక్క మంగళగిరి టిడిపి సెంట్రల్ ఆఫీసు నుండి ఎప్పటికప్పుడు పార్టీ నేతలకు ఫోన్లు చేసి అందించవలసిన సహాయక చర్యలు గురించి అడిగి తెలుసుకున్నారని సీనియర్ టిడిపి నాయకులు గుబ్బల మూర్తి తెలియజేశారు.

# తుఫానును ఎదుర్కొనడంలో ప్రభుత్వం ముందుచూపు భేష్

## - జిల్లా కలెక్టర్ రామ సుందర్ రెడ్డి - పనితీరు అభినందనీయం - అన్ని శాఖలు సమన్వయంతో పనిచేశాయి

## - గజపతినగరంలో విస్తృత పర్యటన - రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్







**విజయనగరం/ గజపతినగరం, (రాజధాని వార్తలు):** మొంథా తుఫానును ఎదుర్కొనడంలో ప్రభుత్వం అనుసరించిన ముందుచూపు అభినందనీయమని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై సాధికారత సంబంధాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. జిల్లాలో తుఫాను కారణంగా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకపోవడానికి కారణం, ప్రభుత్వం చేపట్టిన ముందు జాగ్రత్తచర్యలేనని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ, ప్రతీ మూడు గంటలకు టెలికాన్ఫరెన్స్ ద్వారా ఎప్పటికప్పుడు ఆదేశాలను ఇస్తూ, రాత్రంతా కంట్రోల్ రూములోనే ఉండి పర్యవేక్షించారని అభినందించారు. గజపతినగరంలో మంత్రి శ్రీనివాస్ బుధవారం విస్తృతంగా పర్యటించారు. ముందుగా ఆయన గంగచోళ్లపెంట గ్రామంలో పర్యటించి, ఇళ్లు కూలిన బాధితులను పరామర్శించారు. వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని, ఇల్లు పునర్నిర్మాణానికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామానికి చెందిన కాళ్లూరి అరవింద్ భాస్కర్ తేజకు ముఖ్యమంత్రి సహాయ నిధినుంచి ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 2,56,000 విలువైన చెక్కును మంత్రి అందజేశారు. అనంతరం గజపతినగరం ప్రభుత్వాసుపత్రిని సందర్శించారు. నెల రోజుల ముందే పురుటినొప్పులు వచ్చి, వైద్యసిబ్బంది సహకారంతో ఆసుపత్రికి చేరుకొని బిడ్డను ప్రసవించిన బాలింతను, వారి బంధువులను మంత్రి ఆసుపత్రిలో పరామర్శించారు. సకాలంలో స్పందించి ఆమెను ఆసుపత్రికి తరలించి ప్రసవానికి సహకరించిన సిబ్బందిని, వైద్యులను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. తుఫాను ప్రభావం, కలిగిన నష్టాలపై ఎంపిడిఓ కార్యాలయంలో అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పెద్దగా నష్టం లేకుండానే తుఫాను నుంచి బయటపడ్డామని అన్నారు. జిల్లా స్థాయితోపాటు, క్షేత్ర స్థాయి నుంచి సైతం అధికార యంత్రాంగం చక్కని పనితీరు కనపరిచి, అన్నిరకాల ముందు జాగ్రత్తలు తీసుకుందని చెప్పారు. ప్రసవానికి దగ్గరగా ఉన్న 300కు పైబడి గర్భిణులను ముందుగానే ఆసుపత్రికి తరలించారని తెలిపారు. అక్కడక్కడా పంట మునక, చెరువులకు గండ్లు, రహదారులు దెబ్బతినడం లాంటి కొన్నినష్టాలు జరిగాయని, ప్రస్తుతం అధికారులు వాటి అంచనాలు రూపొందిస్తున్నారని చెప్పారు. ఈ పర్యటనలో మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, మాజీ జడ్పిటిసి మక్కువ శ్రీధర్, మండల ప్రత్యేకాధికారి రమేష్, ఇతర అధికారులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డిని, యంత్రాంగాన్ని అభినందించిన ముఖ్యమంత్రి



**విజయనగరం, (రాజధాని వార్తలు):** మొంథా తుఫాన్ సమయంలో నిర్విరామంగా కృషి చేసి ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా సేవలు అందించినందుకు, సమయస్ఫూర్తితో, సమన్వయం, మానవతా దృక్పథంతో వ్యవహరించిన జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డిని, జిల్లా యంత్రాంగాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. తుఫాన్ సమయంలో జిల్లా యంత్రాంగం ప్రాణ నష్టం లేకుండా చర్యలు తీసుకోవడం, ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడం, ప్రజలకు తక్షణ సహాయం అందించేలా చురుకైన చర్యలు తీసుకోవడంతోబాటు, సమిష్టి కృషి ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించడం ప్రశంసనీయమని ముఖ్యమంత్రి జిల్లానుద్దేశించి పేర్కొన్నారు. సమష్టి కృషితో బుధవారం జిల్లాలోని తుఫాన్ ప్రభావం, నష్టాలు గూర్చి టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా ముఖ్యమంత్రి అభినందనలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది తుఫాన్ సమయంలో ప్రాణాల్ని సైతం పణంగా పెట్టి ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించడం, అవసరమైన సరకులు అందించడం, సమాచారాన్ని నిరంతరం కలెక్టరేట్ కు చేరవేయడం వంటి విధుల్లో చూపిన అంకితభావం ప్రజలకు రక్షణ కవచంగా మారిందని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారని తెలిపారు. జిల్లా అధికారులు, పోలీసులు, రెవెన్యూ, పంచాయతీరాజ్, మునిసిపల్ శాఖలతో సమన్వయం పాటిస్తూ సచివాలయ సిబ్బంది చూపిన సేవలు ఆదర్శప్రాయమని ముఖ్యమంత్రి చెప్పారని తెలిపారు. బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రశంసించిన విషయాన్ని వెల్లడించారు. యంత్రాంగం సంపూర్ణ సహకారం, కృషి ఫలితంగా ఈ అభినందనలు పొందమని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాగే సమన్వయంతో, సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులకు, మండల ప్రత్యేక అధికారులకు, ముఖ్యంగా క్షేత్ర స్థాయిలో చక్కగా విధులను నిర్వహించిన సచివాలయ సిబ్బందికి జిల్లా కలెక్టర్ అభినందనలు తెలిపారు.

# బొండపల్లి, గజపతినగరం తహసిల్దార్ కంట్రోల్ రూమ్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి



**గజపతినగరం/ బొండపల్లి, (రాజధాని వార్తలు):** గజపతినగరం, బొండపల్లి తహసీల్దార్ కార్యాలయాలలో గల కంట్రోల్ రూమ్‌లను జిల్లా కలెక్టర్ ఎస్.రామ సుందరరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోంత తుఫాన్ తీవ్రత దృష్ట్యా కార్యాలయాల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని తగు సూచనలు చేశారు. బొండపల్లి తహసీల్దార్ కార్యాలయం కంట్రోల్ రూమ్‌ను తనిఖీ చేసే సమయానికి మండల తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు తాను మండలంలోని గరుడబిల్లి గ్రామం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి గ్రామస్తులను తరలిస్తూ, పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న వారికి ఏర్పాటు చేసిన భోజన వసతులను పర్యవేక్షించడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా మండల పార్టీ అధ్యక్షులు బొద్దల చిన్నం నాయుడు, గ్రామ పెద్దలు, అన్ని పార్టీల ముఖ్య నాయకులు పాల్గొన్నారు. పునరావాస కేంద్రంలో 120 మందికి భోజన వసతిని కల్పించినట్లు బొద్దల చిన్నం నాయుడు తెలియజేశారు. మంగళవారం రాత్రి మోంత తుఫాన్ తీరాన్ని దాటే సమయంలోను, దాటిన తర్వాత విస్తృత వర్షపాతం పడే అవకాశం ఉన్నందున తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా విధులను నిర్వహించాలని ఆయన సూచించారు.

# రైతుల ఆందోళనకి అవసరం లేదు - ప్రభుత్వం అండగా ఉంటుంది

## - మొంథా తుఫాను ప్రభావిత పంట పొలాలను పరిశీలించిన టీడీపీ నాయకులు నులుకుర్తి, డా. చప్పిడి

**కరప, (రాజధాని వార్తలు):** మొంథా తుఫాను ప్రభావంతో పలు గ్రామాల్లో వరి పంటలు తీవ్రంగా దెబ్బతిని రైతులు ఆందోళన చెందుతున్న తరుణంలో, టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, రాష్ట్ర శెట్టిబలి వెల్ఫేర్, డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు బాధిత రైతులకు భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు బుధవారం కూరాడ, వాకాడ, యండమూరు, గొర్రిపూడి గ్రామాల్లోని పంట పొలాలను స్వయంగా పరిశీలించారు. భారీ వర్షాలు, ఈదురు గాలులతో నేలకొరిగిన వరి పంటలను నిశితంగా పరిశీలించిన నాయకులు రైతులతో మాట్లాడి వారి పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఎవ్వరూ అధైర్యపడవద్దన్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ప్రతి కౌలు రైతుకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. మండల పరిధిలో సుమారు 2,850 ఎకరాల్లో వరి పంట నేలకొరి గిందని గుర్తించినట్లు తెలిపారు. రైతులు క్రాప్ ఇన్సూరెన్స్ వివరాలతో నివేదికలు సమర్పించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనలు పూర్తి చేసి నష్టపోయిన ప్రతి రైతుకు తక్షణ సహాయం అందేలా చర్యలు ప్రారంభించాలని ఆదేశించారు. ప్రస్తుత ప్రభుత్వం అన్నదాతకు అండగా ఉందన్నారు. మీ నష్టం ఒక్క రూపాయి కూడా వృథా కాకుండా పరిహారం అందేలా కృషి చేస్తాం" అని నాయకులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు దేవు వెంకటేశ్వరరావు (వెంకన్న), సర్వసిద్ధి ఏడుకొండలు, మేడిశెట్టి పాండురంగ, సింహాచలం, బొమ్మతి చిట్టిబాబు, మారెళ్ళ ఈశ్వరరావు, పాలిక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అన్న సమారాధన మహోత్సవంలో సిరమ్మ





**విజయనగరం, (రాజధాని వార్తలు):** ధర్మపురిలో శ్రీ అభయ గణపతి ప్రతిష్టాపన మరియు అన్నసమారాధన ఆహ్వానం మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్, వై.యస్.ఆర్.సీ.పి.జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి నియోజకవర్గం సమన్వయ కర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ బుధవారం ఉదయం గం.10.00 లకు శ్రీ అభయ గణపతి ప్రతిష్టాపనలో పాల్గొన్నారు. అనంతరం గణపతి పూజ, పుణ్యాహవచనం, గవ్యాంతమార్చనలు, పునః పూజలు, ధాన్యాది వాసం, అగ్ని ప్రతిష్ట, ఆవాహిత దేవతా హవనములు, లక్ష్మీ గణపతి హోమం తదితర కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు, ముఖ్యనాయకులు, గ్రామ ప్రజలు, చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షులు తోట వాసు, చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**RAJADHANI CLASSIFIEDS Ad. Call**
**9440662699, rajadhanivartalu.com**

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యన్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్స్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎప్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699

# అయ్యప్ప భక్తి మార్గం సేవా భాగ్యం : తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు



**భద్రాచలం, (రాజధాని వార్తలు):** భద్రాచలం పట్టణంలోని శ్రీ అయ్యప్ప దేవాలయంలో ప్రతి బుధవారం జరుగుతున్న నిత్య అన్నదానం కార్యక్రమంలో భద్రాచలం తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకున్న ఆయన భక్తులకు స్వయంగా అన్నం వడ్డించి సేవా కార్యక్రమంలో భాగమయ్యారు. అన్నదానం మహత్యాన్ని వివరించిన తహసీల్దార్ అన్నదానం అన్నది దైవ సేవల్లో శ్రేష్ఠమైనది అన్నదాత సుఖీభవ అనే దైవ సందేశాన్ని ప్రపంచానికి తెలియజేస్తూ అనేక మందికి ఆకలి తీర్చటం ద్వారా పుణ్యఫలితాన్ని అందిస్తుంది అని పేర్కొన్నారు. భక్తి వినయం నియమాచరణలతో సాగేదే అయ్యప్ప మార్గమని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మండల దీక్ష, అయ్యప్ప స్వామి భక్తి మార్గం సద్గుణాల పెంపు, సహనం, సమానత్వానికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన గుర్తుచేశారు. శబరిమల యాత్ర మనోనిగ్రహం, క్రమశిక్షణ, భక్తి అనే మూడు విలువల సమ్మేళనం అని వివరించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు వేద మంత్రోచ్చారణ మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరహర స్వామీ శబరిమలయ్య నినాదాలతో దేవాలయ పరిసరాలు మ్రోగిపోయాయి. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శనానికి విచ్చేశారు. ఈ సేవా కార్యక్రమం నిర్వహణలో దేవాలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప మాల దీక్ష స్వాములు పాల్గొన్నారు .భక్తులు కీలక పాత్ర పోషించారు. ప్రతి వారమూ భక్తుల కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

# నష్టపోయిన రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుంది - వరి పంట పరిశీలించిన దత్తుడు



**పెదపూడి, (రాజధాని వార్తలు):** పెదపూడి మండలం కరకుదురు గ్రామంలో "మొంథా" తుఫాను కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు నేల కొరిగి తడిచిన వరి పొలాలను కరకుదురు గ్రామ మాజీ సర్పంచ్ సింగినీడి దత్తుడు, మండల వ్యవసాయ అధికారి సత్య ప్రసాద్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ దత్తుడు మాట్లాడుతూ ఈ మొంథా తుఫాను కారణంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నిరంతరం అనపర్తి నియోజకవర్గం అంతా పర్యటించి ఏఏ గ్రామాలలో ఎంత పంటనష్టం వాటిల్లింది అంచనాకు నాయకులు, అధికారులను ఆదేశిస్తున్నట్టు చెప్పారు. నియోజకవర్గంలో ఏ ఏ గ్రామాలలో ఎంత పంట నష్టం జరిగింది, విద్యుత్ స్తంబాలు గాని, చెట్లు గాని, ఇతర నష్టంపై అంచనా వెయ్యడం జరుగుతుందన్నారు. అలాగే ఒక్క కరకుదురు గ్రామంలో శివన కాలువకి 250 నుంచి 300 ఎకరం దాకా పంటనష్టం ఉంటుందని, ఈ వరి పంట అంతా పాలు పోసుకునే దశలో ఉందని, ఇంకొక 20 రోజుల్లో పంట చేతికొచ్చే పరిస్థితి ఉండగా అది వర్షానికి పడిపోయి ఆ పంట కోయడానికి కూడా పనికి రాకుండా పోయిందన్నారు. ఒకవేళ ఆ పంటను కోసినా రైతుకు పెట్టుబడి కూడా రాదన్నారు. కరకుదురు గ్రామం మొత్తం సుమారు 700 ఎకరం దాకా నేలమట్టం అయిపోయిన పంటను వ్యవసాయ అధికారి సత్య ప్రసాద్, గ్రామ కార్యదర్శి సూర్యలక్ష్మి, వ్యవసాయ సహాయకులు అఫ్జల్, అధికారులు, గ్రామ నాయకులు, రైతులు సమక్షంలో ఈ పంట నష్టం పరిశీ లించడం జరిగిందన్నారు. కరకుదురు గ్రామంలో జరిగిన పంట నష్టాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి తెలియపరచడం జరుగుతుందని, టిడిపి సీనియర్ నాయకులు, కరకుదురు గ్రామ మాజీ సర్పంచ్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ సింగినీడి దత్తుడు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు, గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# గౌరీ కోనేరులో పర్యటించిన ఎమ్మెల్యే

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** తుఫాను నేపథ్యంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు ధ్వంసం అయిన పెద్దాపురం గౌరీ కోనేరు కాలనీలో బుధవారం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పర్యటించారు. కాలనీవాసులతో మాట్లాడి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. తుఫాను ఈదురు గాలులకు చెట్లు విద్యుత్ స్తంభాలు కూలి, విద్యుత్ వైర్లు ధ్వంసం కావడంతో ఈ కాలనీలో విద్యుత్ సరఫరా నిలిచిపోయి అవస్థలు పడుతున్నట్టు కాలనీ వాసులు తెలిపారు. అంధకారంలో కాలనీ ఉందని, విద్యుత్ లేక మోటార్లు పనిచేయక, ఓవర్ హెడ్ ట్యాంక్ నుండి నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. వెంటనే ఎమ్మెల్యే చినరాజప్ప స్పందించి వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే విద్యుత్తు పునరుద్ధరించిన వెంటనే నీటి



సరఫరా ప్రారంభించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నిమ్మకాయల రంగనాగ్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శిథిలమైన మున్సిపల్ షాపులు కూల్చివేత

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట మున్సిపల్ కార్యాలయం అతి దగ్గరలో బండ్ మార్కెట్ వద్ద ఏళ్ల తరబడి శిథిల స్థితికి చేరి కూలడానికి సిద్ధంగా ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను బుధవారం జెసిబితో పడగొట్టారు. మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య ఆదేశాల మేరకు బుధవారం ఉదయం నుండి సాయంత్రం వరకు జెసిబి అందరంతో కూలిపోయిన షాపులను తొలగించారు. ముగ్గురు దుకాణదారులు ఇవే షాపు లను ఆశ్రయించి వ్యాపారాలను నడుపుకుంటున్నప్పటికీ వారిని ఖాళీ చేయించి షాపులను తొలగించారు. ఈ విషయమై మున్సిపల్ ఆర్వో నూకరాజును వివరణ కోరగా 8 షాపులు పూర్తిగా శిథిలు అవడంతో తొలగించడం జరిగిందని, కమి షనర్ ఆధ్వర్యంలో



కొత్త షాపులు నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదన సిద్ధం చేసి పంపనున్నట్లు చెప్పారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan